మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం
MONDAY
21-9-2026

జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 2 Volume:2 | సంచిక: 83 Issue: 83

Circulated to Telangana
Published from Jagitial

21 సెప్టెంబర్ 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం దక్షిణాయనం - వర్ష ఋతువు భాద్రపద మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:08 సూర్యాస్తమయం - సా. 6:09 తిథి దశమి రా. 7:58 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఉత్తరాషాఢ ఉ. 6:58o వరకు యోగం శోభన సా. 4:01 వరకు కరణం తైతుల ఉ. 6:58 వరకు గరజి రా. 7:58 వరకు వర్జ్యం మ. 1:25 నుండి మ. 3:11 వరకు దుర్ముహూర్తం మ. 12:33 నుండి మ. 1:21 వరకు మ. 2:57 నుండి మ. 3:45 వరకు రాహుకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:08 వరకు యమగండం ఉ. 10:39 నుండి మ. 12:09 వరకు గుళికాకాలం మ. 1:39 నుండి మ. 3:09 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:32 నుండి తె. 5:20 వరకు అమృత ఘడియలు రా. 12:01 నుండి రా. 1:47 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:45 నుండి మ. 12:33 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

## నాని ప్యారడైజ్ టికెట్ రేట్ల పెంపు




హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ది ప్యారడైజ్'కు తెలంగాణ ప్రభుత్వం సినిమా టికెట్ ధరల పెంపు, అదనపు షోలు, స్పెషల్ ప్రీమియర్ ప్రదర్శనకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఆదివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నెల 24న సినిమా థియేటర్లలో విడుదల కానుండగా, ఒక రోజు ముందే అంటే సెప్టెంబర్ 23న సాయంత్రం 6:30 గంటలకు తరువాయి 2 వ పేజీలో...

## రాష్ట్రానికి భారీ వర్షసూచన



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉండటంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో స్పష్టం చేసింది. ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోందని, అది సోమవారం నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో తరువాయి 2 వ పేజీలో...

## వాట్సాప్‌కు అలాట్‌మెంట్ లెటర్లు



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): తెలంగాణలో ఇందిరమ్మ ఎల్ఐజీ ఫ్లాట్ల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం కీలక అప్‌డేట్ ఇచ్చింది. ఎంపికైన లబ్ధిదారులకు సోమవారం (సెప్టెంబర్ 21) నుంచి అలాట్‌మెంట్ లెటర్లు జారీ చేయనున్నట్లు తెలంగాణ హౌసింగ్ బోర్డు తాజాగా ప్రకటన విడుదల చేసింది. ఇందుకోసం లబ్ధిదారులు ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా డిజిటల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. లబ్ధిదారుల రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లకు నేరుగా వాట్సాప్, ఎస్సెమ్మెస్ ద్వారా అలాట్‌మెంట్ లెటర్లను పంపించనున్నారు. అలాగే తెలంగాణ హౌసింగ్ బోర్డు తరువాయి 2 వ పేజీలో...



# బహుజనుల బాణాన్ని!

## యువత కోసం పోరాడుత

### కొడంగల్‌లో కవిత పాంచజన్య సంకల్ప సభ

కొడంగల్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. యువత, బహుజనుల హక్కుల కోసం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తో అయినా కొట్లాడటానికి సిద్ధమని ఆమె ప్రకటించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సభకు ముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్న కవిత, తన రాజకీయ వైఖరిని వివరిస్తూ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి తరువాయి 2 వ పేజీలో...

# వినాశనం వైపు వడివడిగా..!




## డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి

వినాశనంవైపు దేశాలు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. తాజాగా, ఆదివారం బాంబుల మోతతో పలు దేశాలు వణికిపోయాయి. రష్యా రాజధాని మాస్కోపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడికి పాల్పడింది. ఆదివారం రాత్రి ఏకంగా 1,600కుపైగా డ్రోన్లు మాస్కో వైపు దూసుకొచ్చినట్లు రష్యా అధికారులు తెలిపారు. వాటిలో భారీ సంఖ్యలో డ్రోన్లను కూల్చివేసినట్లు వెల్లడించారు. ఈ దాడిని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ ఇప్పటివరకు జరిగిన అతిపెద్ద డ్రోన్ దాడిగా అభివర్ణించారు. దాడిలో ఇద్దరు మృతి చెందగా.. పలువురు సురక్షితంగా తరలించారు.

### రియాద్ విమానాశ్రయంపై హౌతీ రెబల్స్ క్షిపణి దాడి

### గాల్లోనే కూల్చేసిన సౌదీ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ

### అమెరికాకు ఇరాన్ '7 షరతుల' అల్టిమేటం

మాస్కో/రియాద్/టెహ్రాన్: మాస్కోలోని ఓ చమురు శుద్ధి కేంద్రంతో పాటు ఓ నివాస భవనం దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు. డ్రోన్ల దాడితో నగరంలోని పలు ప్రాంతాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించాయని, చమురు శుద్ధి కేంద్రం నుంచి పొగలు ఎగసిపడ్డాయని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు. మాస్కో ప్రాంతంలోని రమెన్స్కోయే జిల్లాలో ఓ 21 అంతస్తుల అపార్ట్‌మెంట్ భవనం నుంచి సుమారు 400 మందిని సురక్షితంగా ఖాళీ చేయించారు. వారిలో 70 మంది చిన్నారులు ఉన్నట్లు ప్రాంతీయ గవర్నర్ ఆండ్రీ తరువాయి 2 వ పేజీలో...



# 'దొర' మాటలు నమ్మొద్దు

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

రాష్ట్రంలోని దళితుల భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని, వారి భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజల ప్రభుత్వ విధానం కాదని ఆయన తేల్చిచెప్పారు.

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు పూర్తి రక్షణ కవచంగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఆశీస్సులతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యతలని అన్నారు. భూసంస్కరణలు, భూ పంపిణీ వంటి చారిత్రక నిర్ణయాలతో నిరుపేద దళితులకు తరువాయి 2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,824 |
| వెండి (కిలో): | రూ.2,,60,600 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,590 |

## విశ్వవాణి



ఏఐతో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు పరిష్కారంగా సముద్రంలో గాలి విద్యుత్‌తో నడిచే డేటా సెంటర్‌ను చైనా ప్రారంభించింది. షాంఘై సమీపంలో సముద్ర మట్టానికి సుమారు 10 మీటర్ల లోతులో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం తొలి దశలో 24 మెగావాట్ల సామర్థ్యంతో పనిచేస్తోంది. సర్వర్లను చల్లబరిచేందుకు భారీ గాలి ప్రసరణ వ్యవస్థలకు బదులుగా సముద్రపు నీటిని వినియోగిస్తున్నారు. సాధారణ డేటా సెంటర్లలో శీతలీకరణకు 40--50 శాతం విద్యుత్ ఖర్చవుతుండగా, ఈ విధానంలో ఆ వినియోగం 10 శాతంలోపే ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



## స్వర్ణ రథంపై మలయప్ప స్వామి దర్శనం

తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో రోజైన ఆదివారం స్వామివారికి స్వర్ణరథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్పస్వామివారు స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. దీంతో ఆలయ పరిసర ప్రాంతాలు గోవింద నామ స్మరణతో పులకించిపోయాయి. స్వర్ణరథోత్సవంలో టీటీడీ ఈవో రవిచంద్ర, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టీటీడీ బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్లా, ప్రశాంతి రెడ్డి, ఎస్వీబీసీ చైర్మన్ శ్రీధర్ వర్మ, సినీనటుడు బాలకృష్ణ సతీమణి వసుంధరాదేవి పాల్గొన్నారు. ఈ నెల 15న ప్రారంభమైన సాలకట్ల బ్రహ్మోత్సవాలు 23వ తేదీతో ముగుస్తాయి. **తిరుమల, సెప్టెంబర్ 20 (ఈవార్తలు):**



## 1500 మంది ఒకే చోట తాగేయొచ్చు!

హైదరాబాద్‌లోనే అతిపెద్ద బార్ ఓపెనైంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ఈ బార్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐఎస్‌బీ రోడ్డులోని పాత ఫిషర్‌మ్యాన్స్ వార్ఫ్ పక్కన 'బిట్వీన్ బ్రూవరీ' పేరుతో దీన్ని ఏర్పాటు చేశారు. సుమారు ఎకరం విస్తీర్ణంలో పలు లెవల్స్‌లో ఇండోర్, అవుట్‌డోర్ సీటింగ్‌తో చూడ చక్కగా తీర్చిదిద్దారు. దాదాపు 1,500 మంది సామర్థ్యంతో హైదరాబాద్‌లోనే అతిపెద్ద బార్. హైదరాబాద్‌లోని బ్రాడ్‌వే బ్రూవరీస్‌ను నిర్వహిస్తున్న గ్రూపే దీన్ని ఏర్పాటు చేసింది. ఇక్కడ అందిస్తున్న వివిధ రకాల బీర్లలో నార్త్‌ఈస్ట్ ఐపీఏ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

**- హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు)**



## రాశి ఫలాలు
21.9.2026

మేషం: చిన్ననాటి మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. ముఖ్యమైన వ్యవహారాలలో సొంత నిర్ణయాలతో ముందుకు సాగుతారు. వృత్తి, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. విలువైన సమాచారం అందుతుంది.

వృషభం: వృత్తి, వ్యాపారాలలో ఒత్తిడులు అధికమౌతాయి. ఆర్థిక పరిస్థితి నిరుత్సాహపరుస్తుంది. చేపట్టిన పనుల్లో తొందరపాటు పనిచేయదు. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

మిధునం: స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. సమాజంలో పరిచయాలు పెరుగుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. సంతాన విద్య ఉద్యోగ విషయంలో శుభవార్తలు అందుతాయి. సన్నిహితులతో వివాదాలు పరిష్కారమౌతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

కర్కాటకం: కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. ఆర్థిక విషయాలు నిరుత్సాహపరుస్తాయి. చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. వృత్తి, వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం.

సింహం: వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. నూతన మిత్రుల పరిచయం ఉత్సాహాన్నిస్తుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగమున పదోన్నతులు పెరుగుతాయి. మిత్రుల నుండి శుభవార్తలు వింటారు. చిన్ననాటి సంఘటనలు గుర్తుకువస్తాయి.

కన్య: ఆస్తి విషయాలలో ఒప్పందాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్థిక పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. వృత్తి, వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి. పాతమిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. విందువినోద కార్యక్రమాలలో పాల్గొంటారు.

తుల: చిన్ననాటి మిత్రులతో ఆలయాలు సందర్శిస్తారు. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. స్వల్ప ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. ఇంటా బయట బాధ్యతలు పెరుగుతాయి. మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి.

వృశ్చికం: ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఆకస్మిక మార్పులు ఉండవచ్చు. విద్యార్థులకు కొంత నిరుత్సాహం తప్పదు. ధనపరంగా ఇబ్బందులు తప్పవు. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత పెరుగుతుంది.

ధనస్సు: వృత్తి, వ్యాపారాలలో అనుకూల పరిస్థితులుంటాయి. కొత్త పనులు చేపడతారు. ఆర్థిక వ్యవహారాలు సంతృప్తినిస్తాయి. దైవ చింతన పెరుగుతుంది. అధికారుల నుండి విమర్శలు తప్పవు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.

మకరం: వ్యాపారాలలో కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. నిరుద్యోగయత్నాలు అనుకూలిస్తాయి. ఆర్థిక పురోగతి కలుగుతుంది. చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. వృత్తి, వ్యాపారాలు ఆశాజనకంగా సాగుతాయి. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. ఆప్తుల నుండి శుభకర్య ఆహ్వానాలు అందుతాయి.

కుంభం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కుటుంబ వ్యవహారాలలో స్వల్ప ఆటంకాలు ఉంటాయి. వృత్తి, వ్యాపారాలలో ఊహించని మార్పులు ఉంటాయి. దూరపు బంధువులను కలుసుకుంటారు. ఆర్థిక సమస్యలు కొంత చికాకు పరుస్తాయి. కుటుంబ సభ్యులతో వివాదాలు ఉంటాయి.

మీనం: కుటుంబంలో చికాకులు తప్పవు. వృత్తి, వ్యాపారాలలో ఊహించని మార్పులుంటాయి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. ఆర్థిక వ్యవహారాలలో నిరుత్సాహం తప్పదు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. బంధువులతో అకారణ వివాదాలు కలుగుతాయి. కొందరి ప్రవర్తన చికాకు పరుస్తాయి.

# మాస్కోపై 1,600డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి



**మొదటి పేజీ తరువాయి**

వోరోబ్యోవ్ తెలిపారు. మరికొన్ని ఇళ్లు కూడా దెబ్బతిన్నట్లు చెప్పారు. రష్యా పార్లమెంట్ ఎన్నికల చివరి రోజున ఈ దాడి జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజధానిని లక్ష్యంగా చేసుకున్న 450 డ్రోన్లను మార్గమధ్యంలోనే కూల్చివేసినట్లు మేయర్ సోబ్యానిన్ తెలిపారు. ఎన్నికల ప్రక్రియను అడ్డుకోవడమే దాడి ఉద్దేశమని ఆయన ఆరోపించారు. అయితే ఉక్రెయిన్ ఈ దాడిపై ఇప్పటివరకు స్పందించలేదు. దేశవ్యాప్తంగా ఉక్రెయిన్‌కు చెందిన 1,100 డ్రోన్లను కూల్చివేసినట్లు రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. ఆక్రమిత క్రిమియా, నల్ల సముద్రం ప్రాంతాల మీదుగా వచ్చిన డ్రోన్లు కూడా ఇందులో ఉన్నాయని తెలిపింది. మరోవైపు, సౌదీ అరేబియా రాజధాని రియాద్‌పై శనివారం యెమెన్‌కు చెందిన ఇరాన్ మద్దతుగల హౌతీ తిరుగుబాటుదారులు భారీ క్షిపణి, డ్రోన్ దాడులతో విరుచుకుపడ్డారు. రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో వరుసగా రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ఒక్కసారిగా కలకలం రేగింది. వెంటనే రంగంలోకి దిగిన సౌదీ ఎయిర్ డిఫెన్స్ ఫోర్సెస్, గగనతలంలోనే దూసుకొస్తున్న బాలిస్టిక్ మిస్సైల్‌ను కూల్చివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ దాడికి సంబంధించిన విజువల్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. కింగ్ ఖలీద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ పరిసరాల్లో భారీగా నల్లటి పొగలు కమ్ముకున్నాయి. విమానాశ్రయంలోని ఇంధన నిల్వల (ఫ్యూయల్ స్టోరేజ్) నెట్‌వర్క్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిగాయని సమాచారం. భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు వెంటనే ఏరియల్ థ్రెట్ అలర్ట్ జారీ చేసి, పలు విమానాల రాకపోకలను తాత్కాలికంగా నిలిపివేశారు. ఆ తర్వాత పరిస్థితి అదుపులోకి రావడంతో ప్రమాదం తప్పిందని ప్రకటించారు. ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు స్పష్టం చేశారు.

### అమెరికాకు ఇరాన్ అల్టిమేటం

అమెరికా–ఇరాన్ మధ్య కొనసాగుతున్న తీవ్ర ఉద్రిక్తతల నడుమ టెహ్రాన్ అత్యంత కీలక ప్రకటన చేసింది. ఇరు దేశాల మధ్య యుద్ధాన్ని శాశ్వతంగా ముగించి చర్చలు ప్రారంభించాలంటే తాము విధించిన 7 ప్రధాన షరతులకు వాషింగ్టన్ అంగీకరించాల్సిందేనని తేల్చిచెప్పింది. లేనిపక్షంలో ఏ క్షణమైనా 'నిర్ణయాత్మక యుద్ధానికి' సిద్ధపడాల్సి ఉంటుందని వైట్‌హౌస్‌ను నేరుగా హెచ్చరించింది. ఖతార్ దౌత్య మార్గాల ద్వారా ఈ నిబంధనల పత్రాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు చేరవేసినట్లు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయ్ అల్ జజీరాకు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం తాము ట్రంప్ ఇచ్చే సమాధానం కోసమే వేచి చూస్తున్నామని పేర్కొన్నారు. "ఈ షరతులను అంగీకరించడం వాషింగ్టన్‌కే మంచిది. ట్రంప్ బెదిరింపులతో ఎలాంటి ఫలితం ఉండదు. తాడోపేడో తేల్చుకునే సమరానికి మేము అన్ని విధాలా సిద్ధంగా ఉన్నాం. అమెరికా ఈ సంక్షోభ ఊబి నుంచి బయటపడాలంటే ఇరాన్ హక్కులను, డిమాండ్లను గుర్తించక తప్పదు" అని రెజాయ్ తన సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' లో స్పష్టం చేశారు.

### ఇరాన్ ప్రధాన డిమాండ్లు ఇవే..

- అన్ని రకాల సైనిక ఫ్రంట్లపై తక్షణమే దాడులు నిలిపివేయాలి.
- అంతర్జాతీయంగా ఫ్రీజ్ చేసిన ఇరాన్ నిధులను విడుదల చేయాలి.
- ఎర్ర సముద్రం, పరిసర జలాల్లో విధించిన నౌకాదిగ్బంధాన్ని ఎత్తివేయాలి.



# వాట్సాప్‌కు అలాట్‌మెంట్ లెటర్లు

**మొదటి పేజీ తరువాయి**

అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా లబ్ధిదారులు తమ అలాట్‌మెంట్ లెటర్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించారు. దీంతో ఎంపికైన వారు తమ మొబైల్ ఫోన్‌లో వచ్చిన సమాచారం ఆధారంగా తదుపరి ప్రక్రియను పూర్తి చేసుకోవచ్చు. ఇదే సమయంలో శేరిలింగంపల్లి నియోజకవర్గం రాయదుర్గంలో ఇందిరమ్మ హౌసింగ్ టవర్స్ నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. సోమవారం రోజున తెలంగాణ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయనున్నారు. మల్కం చెరువు వెనుక భాగంలో ఉన్న 2.85 ఎకరాల ప్రభుత్వ భూమిలో ఈ నిర్మాణాలను చేపట్టనున్నారు. ఈ ప్రాజెక్టులో మొత్తం 480 ఫ్లాట్లను నిర్మించనున్నారు. ఒక్కో ఫ్లాట్ సుమారు 528 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. నాలెడ్జ్ సిటీ వంటి కీలక ప్రాంతాలకు సమీపంలో ఈ ప్రాజెక్టు ఉండటంతో రాయదుర్గం ప్రాంతంలో ఇందిరమ్మ ఫ్లాట్ల నిర్మాణం ప్రాధాన్యం సంతరించుకుంది. రాయదుర్గంలో నిర్మించనున్న ఫ్లాట్ల మార్కెట్ విలువతో పోలిస్తే ప్రభుత్వం లబ్ధిదారులకు భారీ ప్రయోజనం కల్పిస్తోందని అధికారులు చెబుతున్నారు. మార్కెట్‌లో సుమారు రూ.50 లక్షల వరకు విలువ ఉండే ఫ్లాట్‌ను లబ్ధిదారులకు కేవలం రూ.6 లక్షలకే అందించే విధంగా పథకాన్ని రూపొందించారు.

# 'ఓపెన్‌ఏఐ'ని హ్యాక్ చేశారు!

**క్లాడ్ సాయంతో అద్భుతం**

**భారత సైబర్ సెక్యూరిటీ పరిశోధకుల ఘనత**

న్యూఢిల్లీ: చాట్‌జీపీటీని రూపొందించిన ఓపెన్‌ఏఐ సంస్థకు భారత సైబర్ సెక్యూరిటీ నిపుణులు షాక్ ఇచ్చారు. అందులోనూ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక టెక్కీతో కూడిన బృందం ఈ ఘనత సాధించడం విశేషం. ఓపెన్‌ఏఐకి పోటీగా ఉన్న మరో ఏఐ 'క్లాడ్' సహాయంతో ఆ సంస్థ సిస్టమ్‌లోని కీలక లోపాలను గుర్తించారు. ఈ పరిశోధన ద్వారా వారు రూ. 5.5 లక్షల బగ్ బౌంటీని కూడా గెలుచుకున్నారు. హ్యాక్‌ట్రాన్ ఏఐ అనే సంస్థకు చెందిన హర్ష్ జైస్వాల్, రాహుల్ మైనీ, ఏపీకి చెందిన మోహన్ పెదపాటి ఈ పరిశోధన చేశారు. ఓపెన్‌ఏఐ అధికారికంగా నిర్వహించిన బగ్ బౌంటీ కార్యక్రమంలో భాగంగా వారు ఈ పరీక్షలు చేపట్టారు. ఓపెన్‌ఏఐ కమ్యూనిటీ ఫోరమ్‌లో ఇమేజ్ ఫైల్స్ హ్యాండిల్ చేసే విధానంలో ఒక లోపాన్ని గుర్తించారు. ఈ లోపాన్ని ఉపయోగించుకుని సర్వర్‌పై పూర్తి నియంత్రణ సాధించే కోడ్‌ను అభివృద్ధి చేయడానికి, దాన్ని డీబగ్ చేయడానికి వారు 'క్లాడ్' ఏఐని ఉపయోగించుకున్నారు. ఇది వారి పనిని చాలా వేగవంతం చేసింది. కేవలం ఫోరమ్‌తో ఆగకుండా, వారు లాగిన్ టోకెన్లలో ఉన్న మరో బలహీనతను అదునుగా చేసుకున్నారు. దీని ద్వారా ఓపెన్‌ఏఐ ఉద్యోగుల ఖాతాలను యాక్సెస్ చేసి, ఆపై కంపెనీకి చెందిన ప్రైవేట్ గిట్‌హబ్ ఎన్విరాన్‌మెంట్‌లోకి ప్రవేశించారు. ఈ మొత్తం ప్రక్రియను 72 గంటలలోపే పూర్తి చేయడం గమనార్హం. ఇందుకోసం వారు ఏఐ టోకెన్ల కోసం సుమారు రూ. 2.5 లక్షలు మాత్రమే ఖర్చు చేశారు. ఈ బృందంలోని మోహన్ పెదపాటి ఆంధ్రప్రదేశ్‌లోని నూజివీడు ట్రిపుల్ ఐటీలో బీటెక్ పూర్తి చేశారు. ఇది చట్టబద్ధంగా, ఓపెన్‌ఏఐ అనుమతితో చేసిన భద్రతా పరీక్షే తప్ప, హానికరమైన హ్యాకింగ్ కాదని నిపుణులు స్పష్టం చేశారు. నిపుణులైన పరిశోధకులు తమ పనిని వేగవంతం చేయడానికి ఏఐ సాధనాలను ఎలా ఉపయోగించుకోవచ్చో ఈ ఘటన నిరూపిస్తోంది. లోపాలను నివేదించిన తర్వాత, ఓపెన్‌ఏఐ వాటిని సరిచేసి, వారికి బహుమతిగా సుమారు రూ. 5.5 లక్షలు చెల్లించింది.



# బహుజనుల బాణాన్ని!

**మొదటి పేజీ తరువాయి**

అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేద్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు. ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే ఇక్కడికి వచ్చానని, ప్రజలు తనకు ధైర్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత విమర్శలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్ఘనిస్తాన్‌తో సమానంగా ఉందని, గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన రేవంత్ రెడ్డి అప్పుడు ఏం చేశారని నిలదీశారు. దేశంలో మహిళలను మహరాణులుగా కీర్తిస్తారని, కానీ వంటింట్లోని గిన్నెల మీద కూడా మగవాళ్ల పేర్లే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.

# రాష్ట్రానికి భారీ వర్షసూచన

**మొదటి పేజీ తరువాయి**

వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది. బుధవారం ఉదయానికి ఈ వాయుగుండం ఉత్తర ఆంధ్రప్రదేశ్–దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలోకి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సెప్టెంబర్ 24న తెలంగాణలోని మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రత్యేకంగా హెచ్చరించింది. అలాగే ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల సహా మరికొన్ని జిల్లాల్లో గంటకు 50–60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.

# 'దొర' మాటలు నమ్మొద్దు

**మొదటి పేజీ తరువాయి**

భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 25 లక్షల ఎకరాల భూమిని దళితులకు, 2 లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన 'దొర' కేసీఆర్ మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. ఈ ఫామ్‌హౌస్ దాదాపు 700 ఎకరాల్లో విస్తరించి ఉందని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు. ఈ క్రమంలోనే ఎర్రవల్లి గ్రామానికి చెందిన 120 మంది దళిత రైతులకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేశారు. భూ యాజమాన్య హక్కులకు సంబంధించిన పత్రాలతో హాజరుకావాలని ఆ నోటీసుల్లో పేర్కొనడంతో దళితుల్లో ఆందోళన మొదలైంది. ఈ నేపథ్యంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటన విడుదల చేశారు. "ప్రభుత్వం మీ భూమిలో అంగుళం కూడా తీసుకోదు. మీ భూములను స్వాధీనం చేసుకునే ఉద్దేశం ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో ఎలాంటి భయం, ఆందోళన అవసరం లేదు. ప్రజల ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది" అని దళితులకు భరోసా ఇచ్చారు. భూ రికార్డుల పరిశీలన, సర్వే, భూ సమస్యల పరిష్కారం వంటి ప్రక్రియలను భూములు లాక్కోవడంగా చూడటం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రజల భూ హక్కులను స్పష్టంగా నమోదు చేయడం, వివాదాలను పరిష్కరించడం, వారి హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. కొంతమంది శక్తిమంతమైన వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టేందుకు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తూ భయాందోళనలు సృష్టిస్తున్నారని మంత్రి ఆరోపించారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఇలాంటి ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.




# నాని ప్యారడైజ్ టికెట్ రేట్ల పెంపు

**మొదటి పేజీ తరువాయి**

స్పెషల్ ప్రీమియర్ షో ప్రదర్శించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ ప్రత్యేక షోకు టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ. 500గా నిర్ణయించారు. అలాగే సెప్టెంబర్ 24 నుంచి తెలంగాణ వ్యాప్తంగా థియేటర్లలో రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు వెసులుబాటు కల్పించారు. మొదటి 10 రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునేందుకు కూడా ప్రభుత్వం అనుమతించింది. మల్టీప్లెక్స్‌లు, స్పెషల్ థియేటర్లలో సెప్టెంబర్ 24 నుంచి 27 వరకు రూ. 95, ఆ తర్వాత సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు రూ. 45 అదనంగా వసూలు చేసుకోవచ్చు. అదేవిధంగా, సింగిల్ స్క్రీన్లలో మొదటి నాలుగు రోజులు రూ. 48, తర్వాతి ఆరు రోజులు రూ. 23 చొప్పున అదనంగా పెంచుకోవడానికి అనుమతించారు. అయితే, ఈ అనుమతులకు ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. నిర్మాతలు తెలుగు సినీ పరిశ్రమ కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోని ఎంప్లాయీస్ వెల్ఫేర్ కమిటీకి రూ. 1 కోటి విరాళంగా అందించాలి. దీంతో పాటు, సినిమా ప్రదర్శన సమయంలో డ్రగ్స్ దుష్ప్రభావాలు, సైబర్ నేరాలపై అవగాహన సందేశాలను తప్పనిసరిగా ప్రదర్శించాలని స్పష్టం చేసింది. ఈ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లను ఆదేశిస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్ ఉత్తర్వులు జారీ చేశారు.

# బెంగాల్ పర్యటనలో తెలంగాణ మీడియా ప్రతినిధులు

**పీఐబీ ఆధ్వర్యంలో ఈ నెల 25 వరకు ప్రెస్ టూర్ రక్షణ, విజ్ఞానం, పర్యావరణంపై అవగాహన**

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): పత్రికా సమాచార కార్యాలయం (పీఐబీ)–హైదరాబాద్ ఆధ్వర్యంలో తెలంగాణకు చెందిన పాత్రికేయుల 5 రోజుల కోల్‌కతా––సుందర్‌బన్ పర్యటన సోమవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 25 వరకు జరిగే ఈ పర్యటనలో రక్షణ, శాస్త్రీయ పరిశోధన, పర్యావరణ పరిరక్షణ, మౌలిక వసతులు, సాంస్కృతిక రంగాలకు సంబంధించిన పలు సంస్థలు, ప్రాజెక్టులను పాత్రికేయులు సందర్శించనున్నారు. ఒక రాష్ట్రం నుంచి మీడియా ప్రతినిధులతో కోల్‌కతాలో పీఐబీ నిర్వహిస్తున్న తొలి పత్రికా విలేకరుల పర్యటన ఇదేనని పీఐబీ తెలిపింది. పర్యటనలో భాగంగా అధికారులు, శాస్త్రవేత్తలు, వివిధ రంగాల నిపుణులతో పాత్రికేయులు నేరుగా మాట్లాడి, క్షేత్రస్థాయిలో అమలవుతున్న కార్యక్రమాలను తెలుసుకోనున్నారు. ఇందులో భాగంగా ఆదివారం మీడియా ప్రతినిధుల బృందం కోల్‌కతాకు చేరుకుంది. 21న గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ), ఫోర్ట్ విలియం–ఈస్టర్న్




కమాండ్‌ను సందర్శించడంతో పర్యటన ప్రారంభమవుతుంది. అనంతరం పీఐబీ కోల్‌కతా కార్యాలయంలో అధికారులతో సమావేశం జరుగుతుంది. 22, 23 తేదీల్లో బృందం సుందర్‌బన్ ప్రాంతంలో పర్యటించనుంది. మడ అడవుల పరిరక్షణ, నిర్వహణ, పగడపు దిబ్బల పథకం, తీర ప్రాంత ఆవాసాల పరిరక్షణ–స్థిరమైన ఆదాయాల కోసం చేపట్టిన మిష్టి కార్యక్రమం, గ్రీన్ ఇండియా మిషన్ కింద పర్యావరణ పునరుద్ధరణ, ప్రాజెక్ట్ టైగర్ ద్వారా రాయల్ బెంగాల్ పులుల సంరక్షణ వంటి కార్యక్రమాలను పరిశీలించనుంది. 24న కోల్‌కతాలోని సెంట్రల్ గ్లాస్ అండ్ సిరామిక్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్–ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిరామిక్స్, టీ బోర్డు, నీటి అడుగున మెట్రోను పాత్రికేయులు సందర్శిస్తారు. 25న నేషనల్ లైబ్రరీ, సైన్స్ సిటీని సందర్శించడంతో పాటు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌తో సమావేశం కానున్నారు. ఈ పర్యటనలో దేశ సముద్ర, రక్షణ సామర్థ్యాలు, శాస్త్రీయ పరిశోధనలు, జీవవైవిధ్య పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి, పట్టణ మౌలిక వసతులు, సాంస్కృతిక సంస్థలకు సంబంధించిన అంశాలను తెలుసుకునే అవకాశం పాత్రికేయులకు లభించనుంది. క్షేత్రస్థాయిలోని అభివృద్ధి, పరిరక్షణ కార్యక్రమాలను ప్రత్యక్షంగా పరిశీలించి వాటిని తెలంగాణతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు తెలియజేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశమని పీఐబీ తెలిపింది. ప్రభుత్వ సంస్థలు, అభివృద్ధి కార్యక్రమాలపై పాత్రికేయులకు ప్రత్యక్ష అవగాహన కల్పించేందుకు పీఐబీ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగానే ఈ పర్యటనను నిర్వహిస్తున్నట్లు పేర్కొంది.

## గ్యాస్ కట్టర్లతో ఏటీఎంలు లూటీ

**కరీంనగర్‌లో రెండు ఎస్‌బీఐ ఏటీఎంలలో భారీ చోరీ**

**దొంగల ముఠాలో మహిళ.. సీసీటీవీ ఫుటేజీలో గుర్తింపు**



కరీంనగర్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): కరీంనగర్ పట్టణంలో ఆదివారం తెల్లవారుజామున దొంగలు రెచ్చిపోయారు. పట్టణ ంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని భారీగా నగదును పహరించుకుపోయారు. గ్యాస్ కట్టర్ల సహాయంతో ఏటీఎం మిషన్ల ను ధ్వంసం చేసి, లోపలున్న నగదుతో పరారయ్యారు. ఈ ఘటనలు పోలీసులకు సవాలుగా మారాయి. వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్శేడ్, ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలలో ఈ చోరీలు జరిగాయి. దుర్శేడ్ ఏటీఎంలోకి తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో కారులో వచ్చిన ఇద్దరు దుండగులు, వారిలో ఒక మహిళ కూడా ఉన్నట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. ఏటీఎంలోకి ప్రవేశించగానే వారు సీసీ కెమెరాలపై ఒక రకమైన ద్రవాన్ని చల్లి, ఆ తర్వాత గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేశారు. ఈ ఏటీఎం నుంచి సుమారు రూ.8 లక్షలు అపహరించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. తిమ్మాపూర్ ఏటీఎంలో ఎంత నగదు పోయిందనేది ఇంకా తెలియరాలేదు. దొంగతనానికి పాల్పడినప్పుడు నిందితులు టోపీలు, కళ్లద్దాలు, మాస్కులు, గ్లోవ్‌లు ధరించి తమ గుర్తింపు తెలియకుండా జాగ్రత్తపడ్డారు. దుర్శేడ్ ఏటీఎంలో చోరీ జరుగుతున్న సమయంలోనే ఎస్‌బీఐ ఢిల్లీ కార్యాలయానికి అలారం వెళ్లింది. దీంతో వారు స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు. ఈ ఘటనలపై పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో పాటు సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. దొంగలు మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాన్ని ఉపయోగించినట్లు గుర్తించారు. ఈ వాహనాన్ని ట్రేస్ చేయడానికి టోల్‌ప్లాజాల వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలిస్తున్నారు. ఇటీవల కాలంలో తెలంగాణలో ఏటీఎం దొంగతనాలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత మే నెలలో మహబూబ్‌నగర్‌లో ఇలాగే ఒక ఎస్‌బీఐ ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కోసి రూ. 2.30 లక్షలు ఎత్తుకెళ్లారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనల నేపథ్యంలో ఏటీఎంల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసే విషయంపై పోలీసు అధికారులు బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు.

## దసరాకు ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లి – శ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. షెడ్యూల్ వివరాల ప్రకారం.. రైలు నంబర్ 07037 (చర్లపల్లి – శ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతో పాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళం – చర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 మరియు నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది. ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి. వీటితో పాటు చర్లపల్లి – నాగర్‌కోయిల్ మార్గంలోనూ 10 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. రైలు నంబర్ 07535 సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 23 వరకు ప్రతి శుక్రవారం, రైలు నంబర్ 07536 సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 25 వరకు ప్రతి ఆదివారం నడవనున్నాయి. పండుగ సీజన్‌లో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులు ఈ ప్రత్యేక సర్వీసులను వినియోగించుకోవాలని అధికారులు సూచించారు.

## కారులో వైద్యుడు సజీవదహనం

సూర్యాపేట, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న ప్రముఖ న్యూరో సర్జన్ సజీవదహనమయ్యారు. ఈ విషాద ఘటన పిల్లలమర్రి శివారులోని హైదరాబాద్–ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీశ్, తన కారులో ఖమ్మం వైపు వెళుతుండగా ఈ దుర్ఘటన జరిగింది. పిల్లలమర్రి వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారు మొత్తం వ్యాపించడంతో డోర్లు లాక్ అయ్యాయి. దీంతో డాక్టర్ జగదీశ్ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. అగ్నిగోళంలా మారిన కారులో ఆయన మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. రహదారిపై వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ దృశ్యాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కాంతి రాణా, విశాల్ గున్నీకి పోస్టింగ్

**ఏపీలో 9 మంది ఐపీఎస్‌లు బదిలీ**

**సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా జయలక్ష్మి**



విజయవాడ, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు 9 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో పలు కీలక విభాగాలతో పాటు, మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు. వివరాల్లోకి వెళితే, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ డీజీగా ఉన్న సి.హెచ్. త్రివిక్రమ్ వర్మను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఫీూా) డైరెక్టర్‌గా నియమించారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్‌గా పనిచేస్తున్న జయలక్ష్మిని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్ల ఐజీగా ఉన్న బి. రాజకుమారిని రైల్వేస్ ఐజీగా నియమిస్తూ, సీఐడీ మహిళా భద్రత విభాగం ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొన్న ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ సస్పెండైన సంగతి తెలిసిందే. ఇటీవలే ప్రభుత్వం వీరిద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేసింది. దాంతో వారి పోస్టింగ్‌కు మార్గం సుగమం అయింది. ఈ క్రమంలో ఈ ఇద్దరు అధికారులకు తాజా బదిలీల్లో పోస్టింగ్ ఇచ్చారు. కొంతకాలంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కాంతి రాణాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ ఐజీగా కీలక బాధ్యతలు ఇచ్చారు. అదేవిధంగా, పోస్టింగ్ కోసం వేచి ఉన్న మరో అధికారి విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు అప్పగించారు. గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్న బాబుజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేశారు. జిల్లా స్థాయిల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పోలవరం ఓఎస్డీగా ఉన్న పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా ఎస్పీగా నియమించారు. సీఐడీ ఎస్పీగా ఉన్న కె. చక్రవర్తిని పోలవరం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఇక సీఎం సెక్యూరిటీ గ్రూప్ (సీఎంఎస్‌జీ) ఎస్పీగా ఉన్న జగదీశ్ అడహళ్లికి పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పరిపాలనా సౌలభ్యం, శాఖల బలోపేతం లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

## మేడికాల అంజయ్యకు విద్యారంగంలో గుర్తింపు



చందుర్తి, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం జోగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచే స్తున్న మేడికాల అంజయ్య విద్యారంగం లో చేస్తున్న సేవలకు గుర్తింపు లభించింది. సెప్టెంబర్ 12న నిర్వహించిన 'స్టార్ ఉత్తమ ప్రతిభా పురస్కారాలు––2026' కార్యక్ర మంలో భాగంగా జరిగిన నాలుగో ప్రపంచ విద్యా సదస్సులో ఆయన పాల్గొన్నారు. 'కృత్రిమ మేధస్సు యుగంలో మానవ మేధస్సును సద్వినియోగం చేసుకోవడం' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో విద్యారంగంలో నూతన ఆవిష్కరణలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, మానవ మేధస్సు ప్రాధాన్యత, విద్యలో అర్థవంతమైన మార్పులుతదితర అంశాలపై చర్చలు జరిగాయి. సదస్సులో పాల్గొన్నందుకు అంజయ్యకు ఆదివారం ఆన్‌లైన్ ద్వారా ధ్రువపత్రం అందించారు. తెలుగు బోధనలో విద్యార్థుల్లో భాషా నైపుణ్యాలు, సృజనాత్మకత, అభ్యసన ఆసక్తిని పెంపొందించేందుకు ఆయన వినూత్న పద్ధతులను అనుసరిస్తున్నారు. పాఠ్యాంశాలను సులభంగా అర్థమయ్యేలా దృశ్య, శ్రవణ, సాంకేతిక ఆధారిత బోధనా పద్ధతులను వినియోగిస్తున్నారు. తెలుగు పాఠ్యాంశాలకు సంబంధించిన బోధనా సామగ్రి, ప్రజెంటేషన్లు, డిజిటల్ విద్యా వనరుల రూపకల్పనలోనూ ఆసక్తి చూపుతున్నారు. అదేవిధంగా ఉపాధ్యాయుల వృత్తిపరమైన అభివృద్ధి, శిక్షణా కార్యక్రమాలు, విద్యా నాణ్యత పెంపుదలకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రస్తుతం పాఠశాలల విద్యా పరిశీలన బృందంలో సభ్యుడిగా విద్యా సంస్థల విద్యా ప్రమాణాలు, బోధనా విధానాలు, విద్యా సంబంధిత అంశాల పరిశీలనలో భాగస్వామ్యం అవుతున్నారు.

## ఎల్ నినో కంటే రేవంత్ ప్రమాదం: హరీశ్

భువనగిరి, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు. "అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6–7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు," అని హరీశ్ రావు మండిపడ్డారు. మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు.

## వ్యక్తిగత కక్షలతో ఇందిరమ్మ ఇల్లు దూరం చేశారు!



కోనరావుపేట, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): శిథిలావస్థకు చేరిన పెంకుటింట్లో నివసిస్తున్న తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైనా, స్థానికంగా వ్యక్తిగత కక్షల కారణంగా దాన్ని దూరం చేశారని మంగళపల్లి గ్రామానికి చెందిన కోటగల్ల దివాకర్ ఆరోపించారు. గ్రామ ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యుల తప్పుడు నివేదికలు, రాత్రికి రాత్రే చేసినట్లు చెబుతున్న తీర్మానాల కారణంగా తనకు అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. దివాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తన భార్య శిరీష పేరుతో ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. తమ కుటుంబం నివసిస్తున్న పెంకుటిల్లు శిథిలావస్థకు చేరిన పరిస్థితిని పరిశీలించిన గ్రామస్థాయి కమిటీ తొలుత ఏకగ్రీవంగా తీర్మానం చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిందని తెలిపారు. అధికారుల పరిశీలన అనంతరం తొలి విడత లబ్ధిదారుల జాబితాలో తమ కుటుంబానికి ఇల్లు మంజూరైందన్నారు. అయితే కమిటీలోని కొందరు సభ్యులు తమపై ఉన్న వ్యక్తిగత కక్షల కారణంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారని దివాకర్ ఆరోపించారు. రాత్రికి రాత్రే మరో తీర్మానం రూపొందించి అధికారులకు పంపడంతో తన పేరు జాబితా నుంచి తొలగించారని పేర్కొన్నారు. అదే సమయంలో భూములు, పక్కా ఇళ్లు ఉన్న కొందరు అనర్హుల పేర్లను జాబితాలో చేర్చి ఇళ్లు కేటాయించారని ఆరోపించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయిలో అధికారులు లబ్ధిదారుడి ఇంటికి వెళ్లి ఆధార్, రేషన్ కార్డు, నివాస పరిస్థితులను పరిశీలించాల్సి ఉన్నప్పటికీ ఆ ప్రక్రియ సక్రమంగా జరగలేదని దివాకర్ తెలిపారు. స్థానిక కమిటీ సభ్యులు పంపిన నివేదిక ఆధారంగానే అర్హుల జాబితాలో మార్పులు చేశారని ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపించాలని దివాకర్ కోరారు. తొలి విడత జాబితా ప్రకారం తమ కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

## బాలికలకు కరాటే చాలా అవసరం: వేములవాడ డీఎస్పీ

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): నేటి సమాజంలో బాలికలతో పాటు ప్రతి ఒక్కరికీ ఆత్మరక్షణ కోసం కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ ఎంతో అవసరమని వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. చిన్న వయసులోనే కరాటే నేర్చుకోవడం ద్వారా విద్యార్థుల్లో ధైర్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని ఓకినావా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు కరాటే గ్రేడింగ్ పరీక్ష నిర్వహించారు. కుమితే, కటాస్, కిక్ బ్యాలెన్సింగ్ తదితర విభాగాల్లో ప్రతిభ కనబరిచిన సుమారు 40 మంది విద్యార్థులు ఎల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, మెరూన్ బెల్టులు సాధించారు. అనంతరం డీఎస్పీ తన కార్యాలయ చాంబర్‌లో విద్యార్థులకు బెల్టులు, ధ్రువపత్రాలను అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ కరాటే కేవలం పోరాట విద్య మాత్రమే కాదని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, ఏకాగ్రతను పెంపొందిస్తుందని తెలిపారు. క్రీడలు విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేస్తాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను క్రీడలు, మార్షల్ ఆర్ట్స్ వైపు ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం అకాడమీ వ్యవస్థాపకుడు అబ్దుల్ మన్నన్ డీఎస్పీ శ్రీనివాసులను శాలువాతో సత్కరించారు. సీనియర్ కరాటే మాస్టర్ కనకరపు రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## రాజన్న యూత్ ఆధ్వర్యంలో అన్నదానం

వేములవాడ అర్బన్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): వేములవాడ పట్టణంలోని బద్ది పోచమ్మ వీధిలో రాజన్న యూత్ (ఆర్‌వైసీ) ఆధ్వర్యంలో శ్రీ సిద్ధి బుద్ధి వినాయకుడి సన్నిధిలో అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గణేశ్ నవరాత్రోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, వైస్ చైర్మన్ నరాల శేఖర్, స్థానిక కౌన్సిలర్ ఇప్పపూల అజయ్, డీఎస్పీ శ్రీనివాసులు హాజరయ్యారు. ముందుగా వారు గణనాథుడికి వేదమంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హారతులు నిర్వహించారు. అనంతరం అతిథులను రాజన్న యూత్ ప్రతినిధులు శాలువాలతో సత్కరించారు. తదుపరి భక్తులకు అన్నప్రసాదం, తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమానికి సహకరించిన దాతలు, స్థానికులు, భక్తులకు రాజన్న యూత్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మరోవైపు, భీమన్న ఆలయం వద్ద ఆదివారం సుమారు 200 మంది పేదలు, అన్నార్తులు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. చిన్నారి నల్ల కౌశికశ్రీ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆమె తల్లిదండ్రులు నల్ల సౌమ్య, అజయ్‌రెడ్డి, తాతయ్య, నానమ్మ నల్ల నాగిరెడ్డి, అమృత దంపతులు, అలాగే కొడిత్యాల రాజేశం జ్ఞాపకార్థం ఆయన సతీమణి శాంత, కుటుంబ సభ్యులు కార్యక్రమానికి సహకరించారు. పలువురు దాతలు అన్నదాన శాశ్వత సభ్యులుగా సహకారం అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్, నాగుల చంద్రశేఖర్, పసుల శ్రీధర్, మధు, కవిత తదితరులతో పాటు చిన్నారి కౌశికశ్రీ రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## 25న ఖైరతాబాద్ గణనాథుడి నిమజ్జనం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది. అనంత చతుర్దశి పర్వదినం సెప్టెంబర్ 25న రావడంతో, అదే రోజు నిమజ్జన కార్యక్రమం చేపట్టాలని నిర్ణయించారు. ఈ సంవత్సరం ఖైరతాబాద్ వినాయకుడు "శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతి"గా భక్తులకు దర్శనమిస్తుండడం తెలిసిందే. ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది. ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు మరియు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

# చేనేత సిరి..
# జోషిక హ్యాండ్లూమ్స్
## చీరాల నేత చీరలకు కొత్త అడ్రస్



సముద్రపు గాలులతో మమేకమైన చీరాల నేల చేనేత కళకు చిరునామాగా నిలుస్తోంది. తరతరాలుగా కొనసాగుతున్న మగ్గాల సంప్రదాయం ఇక్కడి కుటుంబాల జీవనంతో విడదీయలేని బంధాన్ని ఏర్పరచుకుంది. ఆ సంప్రదాయాన్ని ఆధునిక అవసరాలకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్లే ప్రయత్నంగా జోషిక హ్యాండ్లూమ్స్ తనదైన గుర్తింపును ఏర్పరుచుకుంటోంది. చేనేతను కేవలం వస్త్ర తయారీగా కాకుండా, కళాకారుడి నైపుణ్యం, నాణ్యత, వినియోగదారుడి అభిరుచిని కలిపే ప్రక్రియగా ఈ సంస్థ చూస్తోంది. మగ్గంపై దారం ఎక్కించే దశ నుంచి పూర్తయిన చీర వినియోగదారుడి చేతికి చేరే వరకు ప్రతి దశకు ప్రాధాన్యం ఇస్తోంది. సంప్రదాయ చేనేత ప్రత్యేకతను కాపాడుతూనే, నేటి తరానికి నచ్చే రంగులు, డిజైన్లు, నమూనాలను పరిచయం చేయడం సంస్థ పనితీరులో ముఖ్యమైన అంశంగా కనిపిస్తోంది. చీరాల చేనేతకు ఉన్న ప్రత్యేకతను విస్తృత మార్కెట్‌కు పరిచయం చేయాలనే లక్ష్యంతో సంస్థ తన కార్యకలాపాలను కొనసాగిస్తోంది.



### నాణ్యతే ప్రధాన ప్రమాణం

జోషిక హ్యాండ్లూమ్స్ పనితీరులో నాణ్యతకు ప్రత్యేక స్థానం ఉంది. కాటన్, సిల్క్ వంటి వస్త్రాలకు అనుగుణమైన నాణ్యమైన దారాలను ఎంపిక చేయడం నుంచి ప్రక్రియ ప్రారంభమవుతుంది. దారాలకు రంగులు అద్దడం, వాటిని మగ్గాలకు సిద్ధం చేయడం, అనుభవజ్ఞులైన నేతకారులతో చీరలను నేయించడం వంటి దశలు పర్యవేక్షణతో సాగుతాయి. మగ్గంపై కళాకారుడి చేతివేళ్లు కదులుతున్న ప్రతిసారీ ఒక ప్రత్యేకమైన వస్త్ర రూపం సిద్ధమవుతుంది. అందుకే చేనేత చీరలో యంత్ర తయారీ వస్త్రాలకు భిన్నమైన ప్రత్యేకత కనిపిస్తుంది. సంప్రదాయ పట్టు చీరల నుంచి సౌకర్యవంతమైన కాటన్ చీరల వరకు విభిన్న అవసరాలకు అనుగుణంగా సేకరణను అందుబాటులో ఉంచుతోంది. వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా ప్రత్యేక నమూనాలు, రంగుల కలయికలు, అవసరమైన మార్పులతో చీరలను తయారు చేయించే అవకాశాన్నీ కల్పిస్తోంది. దీంతో కొనుగోలు ప్రక్రియ కేవలం సిద్ధంగా ఉన్న వస్త్రాన్ని ఎంచుకోవడం కాకుండా, వినియోగదారుడి అభిరుచికి దగ్గరగా ఉండే చీరను రూపొందించే అనుభవంగా మారుతోంది.

### సంప్రదాయానికి ఆధునిక మార్కెటింగ్

జోషిక హ్యాండ్లూమ్స్ వెనుక ఉన్న ఆలోచనలో చేనేత కుటుంబ అనుబంధంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ అనుభవం కూడా కీలకంగా మారాయి. సంస్థ నిర్వాహకుడు లేళ్ల విజయ్ కుమార్, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్ టెక్నాలజీలో డిప్లొమా విద్యను అభ్యసించడం ద్వారా చేనేత తయారీ ప్రక్రియపై అవగాహన పెంచుకుని, ఈ రంగాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సంస్థ కార్యకలాపాలను రూపొందించారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తమిళనాడు, ఢిల్లీలోని పలు సంస్థల్లో పనిచేసిన అనుభవం ద్వారా వస్త్ర పరిశ్రమలోని మార్కెట్ విధానాలు, వినియోగదారుల అభిరుచులు, మార్కెటింగ్ మెలకువలను తెలుసుకున్నారు. ఆ అనుభవాన్ని చీరాల చేనేతతో అనుసంధానిస్తూ ఉత్పత్తి నుంచి విక్రయం వరకు సమగ్ర విధానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. నేతకారుడి శ్రమకు విలువ, చేనేత వస్త్రానికి గుర్తింపు, వినియోగదారుడికి నాణ్యత.. ఈ మూడు అంశాలను కలిపే వేదికగా జోషిక హ్యాండ్లూమ్స్ పనిచేస్తోంది.

### సరసమైన ధర.. విస్తృత ఎంపిక

చేనేత వస్త్రాలపై ఉన్న అభిమానం మధ్యతరగతి కుటుంబాలకు కూడా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో ధరల విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. నాణ్యతకు తగిన విలువ ఉండేలా, వివిధ ఆర్థిక స్థాయిల వినియోగదారులకు సరిపోయే ధరల్లో చీరలను అందించడంపై దృష్టి పెడుతోంది. రోజువారీ వినియోగానికి సరిపోయే కాటన్ చీరల నుంచి ప్రత్యేక సందర్భాల్లో ధరించే పట్టు చీరల వరకు విభిన్న ధరల శ్రేణిని అందుబాటులో ఉంచుతోంది. వివాహాలు, పండుగలు, కుటుంబ వేడుకలు, ఇతర శుభకార్యాల కోసం ప్రత్యేక కలెక్షన్లను సిద్ధం చేస్తోంది. పెళ్లి చీరలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ సంప్రదాయ డిజైన్లతో పాటు ఆధునిక అభిరుచులకు సరిపోయే నమూనాలను అందిస్తోంది. ఒకే చోట వివిధ రకాల వస్త్రాలు, రంగులు, డిజైన్లు, ధరలను పరిశీలించే అవకాశం ఉండటం వినియోగదారులకు ఎంపికను సులభతరం చేస్తోంది. నాణ్యమైన చేనేత ప్రతి కుటుంబానికి చేరువ కావాలనే ఆలోచనతో మార్కెట్ అవసరాలను అర్థం చేసుకుని సేకరణను రూపొందించడం సంస్థ విధానంలో భాగంగా మారింది.



# యెమెన్‌లో భీకర పోరు.. 44 మంది మృతి

న్యూఢిల్లీ: యెమెన్‌లో ప్రభుత్వ దళాలు, హౌతీ తిరుగుబాటుదారుల మధ్య ఘర్షణలు తీవ్రరూపం దాల్చాయి. గత 24 గంటల్లో జరిగిన భీకర పోరులో కనీసం 44 మంది మరణించినట్లు సైనిక వర్గాలు వెల్లడించాయి. దేశ నైరుతి ప్రాంతంలోని తాయిజ్, లహిజ్ ప్రావిన్సుల్లో ఈ ఘర్షణలు చోటుచేసుకున్నాయి. తాయిజ్ ప్రావిన్సులోని అల్–కదా, అల్–వాజియా ప్రాంతాల్లో హౌతీలు జరిపిన దాడులను ప్రభుత్వ బలగాలు తిప్పికొట్టాయి. ఈ ఘర్షణల్లో ఆరుగురు ప్రభుత్వ సైనికులు, 11 మంది హౌతీ సాయుధులు మరణించారు. మరోవైపు, లహిజ్ ప్రావిన్సులో వ్యూహాత్మకంగా కీలకమైన బాబ్ అల్–మండెబ్ జలసంధి సమీపంలోని కహబూబ్ పర్వత ప్రాంతం స్వాధీనం కోసం జరిగిన పోరులో 12 మంది సైనికులు, ఒక కమాండర్‌తో సహా 15 మంది హౌతీ తిరుగుబాటుదారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ నెల ఆరంభంలో హౌతీ రెబల్స్ కీలకమైన మోఖా నౌకాశ్రయంతో పాటు బాబ్ అల్–మండెబ్ జలసంధిలోని మయూన్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకున్న నేపథ్యంలో ఈ తాజా ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం ఇరు పక్షాలు ఎర్ర సముద్ర మార్గంలోని వివాదాస్పద ప్రాంతాలకు భారీగా బలగాలను తరలిస్తున్నాయి. 2014లో హౌతీలు రాజధాని సనాతో పాటు దేశంలోని ఉత్తర ప్రాంతాలను ఆక్రమించడంతో యెమెన్‌లో అంతర్యుద్ధం ప్రారంభమైంది. అనంతరం 2015లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వానికి మద్దతుగా సౌదీ అరేబియా నేతృత్వంలోని సంకీర్ణ దళాలు రంగంలోకి దిగాయి. అప్పటి నుంచి దేశంలో ఘర్షణలు నిరంతరాయంగా కొనసాగుతూనే ఉన్నాయి.

# న్యూరాలింక్ అద్భుతం.. మాట్లాడాడు!

న్యూయార్క్: టెక్నాలజీ ప్రపంచంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. ఎలాన్ మస్క్ స్థాపించిన న్యూరాలింక్ సంస్థ, తమ బ్రెయిన్–కంప్యూటర్ ఇంటర్‌ఫేస్ (బీసీఐ) టెక్నాలజీతో సాధించిన ఒక కీలకమైన పురోగతిని ప్రపంచానికి చూపింది. మాటలు పూర్తిగా కోల్పోయిన ఒక వ్యక్తి, కేవలం తన ఆలోచనల ద్వారా మాట్లాడగలిగిన అపురూప దృశ్యాన్ని ఒక వీడియో ద్వారా విడుదల చేసింది. ఈ ప్రయోగం వైద్య శాస్త్రంలో కొత్త ఆశలకు ఊపిరి పోస్తోంది. బ్రెరీ అనే వ్యక్తి బల్బార్–ఆన్‌సెట్ అమియోట్రోఫిక్ లాటరల్ స్క్లెరోసిస్ (ఏఎల్ఎస్) అనే తీవ్రమైన నాడీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు.



# దైవ రక్షణ

హైదరాబాద్‌లోని ఓల్డ్ అల్వాల్ పరిధిలోని కావేరి ఎంక్లేవ్, జొన్నబండలో గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం లక్ష్మీ గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, హోమ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. విఘ్నహర్త యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. క్రమబద్ధంగా దర్శనం జరిగేలా చర్యలు చేపట్టి, భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను భక్తులు అభినందించారు. కార్యక్రమంలో పూజారి రాజశేఖర్ శర్మ పాల్గొన్నారు.

**- అల్వాల్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు)**




# పర్యావరణ పరిరక్షణ

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణహితమైన జ్యూట్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ప్లాస్టిక్ వ్యతిరేక ఉద్యమ నేత, సీనియర్ న్యాయవాది నాగిరెడ్డి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ మేరకు జగిత్యాల జిల్లా న్యాయస్థానంలో న్యాయమూర్తులకు జ్యూట్ బ్యాగులను అందజేశారు. జగిత్యాల జిల్లా జడ్జి రత్న పద్మావతి, జిల్లా అదనపు జడ్జి సునీత రవీందర్ రెడ్డి, సీనియర్ జడ్జి డి. నాగేశ్వర్ రావు, జూనియర్ సివిల్ జడ్జి నికిషా కరాంజియాలను కలిసి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే పర్యావరణ నష్టాలను వివరిస్తూ వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారి చేతుల మీదుగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేయించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్ర నర్సయ్య మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని కోరారు. నిత్య జీవితంలో జ్యూట్, వస్త్ర సంచుల వంటి పునర్వినియోగ సంచులను ఉపయోగించడం ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను నియంత్రించవచ్చన్నారు.

**- జగిత్యాల టౌన్, సెప్టెంబర్ 20 (ఈవార్తలు)**

# నా పనైపోయిందనుకున్నా

**: అజిత్ దోవల్**

**మనవాళ్లు చైనాకు పట్టుబడ్డారు**

**యువ ఐపీఎస్‌గా ఉన్నప్పటి ఘటనను గుర్తుచేసుకున్న ఇండియన్ జేమ్స్ బాండ్**



రూర్కెలా: జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తన ఉద్యోగ జీవితం తొలినాళ్లలో ఎదురైన ఓ క్లిష్టమైన సంఘటనను గుర్తుచేసుకున్నారు. చైనా సైన్యం తన బృందాన్ని అదుపులోకి తీసుకున్నప్పుడు, ఇక తన పనైపోయిందన్న ఆందోళనకు గురయ్యానని ఆయన వెల్లడించారు. ఐఐటీ రూర్కీ స్నాతకోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించిన ఆయన, ఈ ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. సిక్కిం భారత్‌లో విలీనమవుతున్న సమయంలో తాను యువ ఐపీఎస్ అధికారిగా అక్కడ ఇంటెలిజెన్స్ బాధ్యతలు చూసేవాడినని దోవల్ తెలిపారు. సరిహద్దుల్లో చైనా పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఏ) కదలికలపై నిఘా పెట్టడం తన విధుల్లో భాగమని చెప్పారు. ఆ క్రమంలో, సరిహద్దు ప్రాంతంలో నిఘా కోసం ఒక బృందాన్ని పంపానని, వారు సుమారు 8 రోజుల్లో తిరిగి రావాల్సి ఉందని పేర్కొన్నారు. అయితే, రోజులు గడుస్తున్నా వారి నుంచి ఎలాంటి సమాచారం రాలేదని దోవల్ వివరించారు. "5 రోజులు, 10 రోజులు, 15 రోజులు గడిచినా వారి ఆచూకీ తెలియలేదు. హిమపాతం వంటి ప్రమాదాలు జరిగినట్లు కూడా ఎక్కడా సమాచారం లేదు. దీంతో వృత్తిపరంగా, మానవతా దృక్పథంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాను" అని అన్నారు. కొన్ని రోజుల తర్వాత హెడ్ క్వార్టర్స్ నుంచి ఫోన్ వచ్చిందని, తాను పంపిన బృందం చైనా కస్టడీలో ఉందని ఉన్నతాధికారి చెప్పినప్పుడు మరింత ఆందోళన చెందానని తెలిపారు. చర్చల అనంతరం చైనా ఆ బృందాన్ని తిరిగి భారత్‌కు అప్పగించిందని దోవల్ చెప్పారు. "కానీ, వారు తిరిగి వచ్చినప్పుడు మానసికంగా, శారీరకంగా పూర్తిగా కుంగిపోయి ఉన్నారు" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై విచారణ ప్రారంభం కావడంతో, చిన్న వయసులోనే తన కెరీర్ ముగిసిపోయిందని, మరో కొత్త ఉద్యోగం చూసుకోవాలని భావించినట్లు ఆయన గుర్తుచేసుకున్నారు. అయితే, విచారణలో అసలు వాస్తవం బయటపడింది. తన బృందానికి హెడ్ క్వార్టర్స్ నుంచి అందించిన మ్యాపులు, స్కెచ్‌లలో లోపాలు ఉన్నాయని, ఆ తప్పిదం కారణంగానే వారు దారి తప్పి చైనా భూభాగంలోకి వెళ్లారని తేలింది. దీంతో ఈ ఘటనలో తన తప్పేమీ లేదని నిరూపితమైనట్లు దోవల్ తన పాత జ్ఞాపకాలను పంచుకున్నారు.

# అక్టోబర్ 8 నుంచి అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్

న్యూఢిల్లీ: పండగ సీజన్ సమీపిస్తుండటంతో ఆన్‌లైన్ షాపింగ్ ప్రియులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న "అమెజాన్ గ్రేట్ ఇండియన్ ఫెస్టివల్ 2026" తేదీలను ఆ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ ఏడాది అతిపెద్ద సేల్‌గా అభివర్ణిస్తున్న ఈ ఫెస్టివల్ అక్టోబర్ 8 నుంచి ప్రారంభం కానుంది. మరో ఈ–కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ తన "బిగ్ బిలియన్ డేస్ 2026" సేల్‌ను అక్టోబర్ 9న ప్రారంభించనున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో, అమెజాన్ వ్యూహాత్మకంగా ఒక రోజు ముందే తన సేల్‌ను మొదలుపెట్టి పోటీకి సై అంటోంది. ఈ సేల్‌లో భాగంగా ఎస్‌బీఐ డెబిట్, క్రెడిట్ కార్డులతో కొనుగోళ్లు చేసేవారికి 10% తక్షణ డిస్కౌంట్ లభించనుంది. ఈఎంఐ లావాదేవీలకు కూడా ఈ ఆఫర్ వర్తిస్తుందని అమెజాన్ స్పష్టం చేసింది. ప్రైమ్ మెంబర్లకు కొన్ని ఎంపిక చేసిన ఆఫర్లపై అదనంగా 10% వరకు ప్రయోజనాలు ఉండనున్నాయి. వీటితో పాటు స్మార్ట్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, గృహోపకరణాలు, నిత్యావసరాలు వంటి అన్ని కేటగిరీలపై భారీ డిస్కౌంట్లు అందుబాటులో ఉంటాయి. బ్లాక్‌బస్టర్ డీల్స్, టాప్ 100 డీల్స్, మెగా డీల్స్, రాత్రి 8 గంటల డీల్స్ వంటి ప్రత్యేక ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు అమెజాన్ సిద్ధమైంది.

# 28 నుంచి 30 వరకు బ్యాంకుల సమ్మె: ఎస్‌బీఐ

న్యూఢిల్లీ: దేశంలోని అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంక్ అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తమ ఖాతాదారులకు ఒక ముఖ్యమైన ప్రకటన జారీ చేసింది. 'యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్' (యూఎఫ్‌బీయూ) పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల పాటు దేశవ్యాప్తంగా బ్యాంకులు సమ్మెకు దిగనున్నాయి. అయితే, దీనికి ముందు సెప్టెంబర్ 26, 27 తేదీలు శని, ఆదివారాలు కావడంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖలలో ప్రత్యక్ష సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందని ఎస్‌బీఐ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో ముఖ్యమైన బ్యాంకు లావాదేవీలు ఉన్నవారు సమ్మె కంటే ముందే వాటిని పూర్తి చేసుకోవాలని సూచించింది. యూఎఫ్‌బీయూ తమ ఆందోళనలో భాగంగా ఇప్పటికే సెప్టెంబర్ 11న ఒకరోజు సమ్మె నిర్వహించింది. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల చివరలో మరోసారి నిరసనకు సిద్ధమైంది. అంతేకాకుండా అక్టోబర్ 26 నుంచి నిరవధిక సమ్మెకు కూడా పిలుపునివ్వడంతో బ్యాంకింగ్ రంగంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎస్‌బీఐ ఈ ముందస్తు సలహాలు జారీ చేసింది. సమ్మె సమయంలో బ్రాంచ్‌లలో సిబ్బంది సహాయం అవసరమయ్యే పనులు, డాక్యుమెంట్ల పరిశీలన, కొన్ని రకాల చెక్కుల ప్రాసెసింగ్ వంటి సేవలకు ఆటంకం కలగవచ్చని బ్యాంకు స్పష్టం చేసింది.

# ఏపీలో 9 కొత్త రైల్వే లైన్లు

**పోర్టులకు పెరగనున్న కనెక్టివిటీ**

**పశ్చిమ, మధ్య భారతం నుంచి అనుసంధానం**

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా విస్తరించే లక్ష్యంతో కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ భారీ కార్యాచరణను సిద్ధం చేసింది. రాష్ట్రంలోని తూర్పు, పశ్చిమ ప్రాంతాలను అనుసంధానిస్తూ, ముఖ్యంగా ప్రధాన ఓడరేవులను కలుపుతూ మొత్తం 9 కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించింది. మధ్య, పశ్చిమ భారతదేశంలోని తెలంగాణ, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని పోర్టులకు నేరుగా కనెక్టివిటీని పెంచడమే ఈ ప్రాజెక్టుల ప్రధాన ఉద్దేశం. దీనివల్ల ప్రయాణ దూరంతో పాటు సరుకు రవాణా వ్యయం కూడా గణనీయంగా తగ్గనుంది. రాయలసీమ, దక్షిణ ప్రాంతాల నుంచి ఓడరేవులకు అనుసంధానాన్ని మెరుగుపరచడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా 120 కిలోమీటర్ల పొడవైన రాజంపేట – నెల్లూరు రైల్వే లైన్‌ను ప్రతిపాదించారు. ఇది రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల నుంచి కృష్ణపట్నం, రామాయపట్నం పోర్టులకు నేరుగా రవాణా సౌకర్యాన్ని కల్పిస్తుంది. అలాగే, 41.5 కిలోమీటర్ల మేర గూడూరు – దుగరాజపట్నం పోర్టు లైన్‌కు సంబంధించి తుది లొకేషన్ సర్వే ప్రక్రియ కొనసాగుతోంది. 88.3 కిలోమీటర్ల పుత్తూరు – అత్తిపట్టు మార్గం చెన్నై ఓడరేవులకు దూరాన్ని తగ్గిస్తుండగా, దీనికి సంబంధించిన డీపీఆర్ ప్రస్తుతం సిద్ధమవుతోంది. ఉత్తరాంధ్ర, ఏజెన్సీ ప్రాంతాల కనెక్టివిటీకి కూడా రైల్వే శాఖ ప్రాధాన్యమిచ్చింది. 150 కిలోమీటర్ల మేర ప్రతిపాదించిన చింతూరు – సామర్లకోట రైల్వే లైన్ ద్వారా ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు కాకినాడ పోర్టుతో నేరుగా సంబంధం ఏర్పడుతుంది. అదేవిధంగా, ఇప్పటికే మంజూరైన ఒడిశాలోని తెరుబాలి – గుణుపూర్ (73.6 కి.మీ) లైన్ ములపేట పోర్టుకు సరుకు రవాణాను మరింత సులభతరం చేయనుంది. వీటితో పాటు, తెలంగాణ నుంచి ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలానికి రైలు మార్గాన్ని అందుబాటులోకి తెచ్చేలా 290 కిలోమీటర్ల పొడవైన సికింద్రాబాద్ – శ్రీశైలం – మార్కాపురం లైన్ కూడా ప్రతిపాదనల్లో ఉంది. గద్వాల – మాచర్ల (184.2 కి.మీ), దొనకొండ – ఒంగోలు (119.6 కి.మీ), దూపాడు – బేతంచెర్ల (53.9 కి.మీ) లైన్లు కూడా ఈ జాబితాలో ఉన్నాయి.



## లఖ్యారి చిత్రం

ఐశ్వర్య లక్ష్మీ



## పిక్ ఆఫ్ ది సండే



అక్కినేని కుటుంబం అంతా ఒక్కచోట చేరింది. నాగార్జున-అమల దంపతులు, నాగచైతన్య, అఖిల్, సుమంత్, సుశాంత్ సహా కుటుంబసభ్యులంతా ఒక్కచోట చేరిన ఫొటోను అఖిల్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నాడు.

# చిరు 'కాకా'.. మరో భాషా!



మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో వస్తున్న కొత్త చిత్రం 'కాకా'పై అంచనాలు భారీగా ఉన్నాయి. 'వాల్తేరు వీరయ్య' లాంటి బ్లాక్‌బస్టర్ తర్వాత వీరిద్దరూ కలిసి పనిచేస్తుండటంతో సినిమాపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో మెగాస్టార్ చిరంజీవి స్వయంగా తన పాత్రకు సంబంధించిన కొన్ని కీలక వివరాలను బయటపెట్టారు. ఇటీవల ఓ సినిమా వేడుకకు హాజరైన చిరంజీవి, 'కాకా' చిత్రంలో తన పాత్ర గురించి సరదాగా కొన్ని హింట్స్ ఇచ్చారు. ఈ సినిమాలో ఆయన 'కదిరి కాళిదాస్' అలియాస్ 'సత్యం' అనే రెండు విభిన్న కోణాలున్న పాత్రలో కనిపించనున్నట్లు తెలుస్తోంది. పైకి ఓ ఆక్వా ఫ్యాక్టరీలో సూపర్‌వైజర్‌గా పనిచేసే 'సత్యం' అనే సాధారణ వ్యక్తిగా కనిపిస్తూనే, తెరవెనుక అండర్‌వాల్డ్‌ను శాసించే 'కదిరి కాళిదాస్' అనే మరో శక్తిమంతమైన పాత్రలో ఆయన నటన అబ్బురపరచనుందని సమాచారం. ఈ చిత్రంలో తండ్రీకూతుళ్ల మధ్య సాగే భావోద్వేగభరితమైన కథనం సినిమాకు ప్రాణం పోయనుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవి కూతురు 'అమ్ములు'గా మలయాళ నటి అనశ్వర రాజన్ నటిస్తున్నారు. మెడిసిన్ చదివే విద్యార్థిని పాత్రలో ఆమె కనిపించనున్నారు. వీరిద్దరి మధ్య వచ్చే ఎమోషనల్ సన్నివేశాలు ప్రేక్షకులను కట్టిపడేస్తాయని తెలుస్తోంది. కేవీఎన్ ప్రొడక్షన్స్ సంస్థ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ వేగంగా జరుగుతోంది. చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా జనవరి 13న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. త్వరలోనే ఫస్ట్ సింగిల్ అప్‌డేట్ కూడా రానుండటంతో మెగా అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు.

# మైసా.. వైల్డ్ యాక్షన్




'నేషనల్ క్రష్' రష్మిక మందన్న తన సరికొత్త అవతారంతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మైసా' చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటివరకు గ్లామరస్, క్యూట్ పాత్రలతో అలరించిన రష్మిక, ఈసారి పూర్తి భిన్నంగా ఒక పవర్‌ఫుల్ యాక్షన్ పాత్రలో కనిపించి అందరికీ షాకిచ్చారు. ఈ టీజర్ ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉంది. 'మైసా' టీజర్‌లో రష్మికను ఒక శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా చూపించారు. రక్తంతో తడిసిన ముఖం, చేతిలో ఆయుధాలు, తీవ్రమైన పోరాట సన్నివేశాలతో ఆమె లుక్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. ముఖ్యంగా, "యుద్ధానికి ఆయుధం అంటే భయం కానీ.. ఆయుధం ఏ యుద్ధానికి భయపడదు" అనే డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. రష్మిక కెరీర్‌లో ఇది ఒక మేజర్ టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంతో రవీంద్ర పుల్లే దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన గతంలో ప్రముఖ దర్శకుడు హను రాఘవపూడి వద్ద సహాయకుడిగా పనిచేశారు. అన్ ఫార్ములా ఫిల్మ్స్ పతాకంపై అనిల్, అజయ్ సయ్యాపురెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. టీజర్‌లోని యాక్షన్ సన్నివేశాలకు జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం మరింత ఉత్కంఠను రేకెత్తించింది. రాహుల్ రవీంద్రన్, రావు రమేశ్ వంటి ప్రముఖ నటులు ఈ చిత్రంలో కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్-ఇండియా స్థాయిలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. 'మైసా' చిత్రం 2026, నవంబర్ 27న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



# 5 షిఫ్టులు పనిచేసేదాన్ని

### : జయప్రద

ప్రముఖ నటి జయప్రద తన కెరీర్ తొలినాళ్లలోని ఆసక్తికర జ్ఞాపకాలను పంచుకున్నారు. కపిల్ శర్మ షోకు సంబంధించిన ఓ పాత వీడియో క్లిప్ తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ఆమె తన సహనటుల గురించి సరదా వ్యాఖ్యలు చేశారు. ఆ రోజుల్లో హీరోలలో అత్యంత సరసాల రాయుడు ఎవరని కపిల్ అడగ్గా, ఆమె నవ్వుతూ "ధర్మేంద్ర" అని సమాధానమిచ్చారు. ఇక సెట్‌కు ఆలస్యంగా వచ్చే హీరో ఎవరనే ప్రశ్నకు, ఆమె రాజేష్ ఖన్నా పేరు చెప్పారు. "నేను దక్షిణాది నుంచి వచ్చాను. అక్కడ ఉదయం 7 గంటలకే సెట్స్‌లో ఉండేదాన్ని. కానీ బాలీవుడ్‌లో 9 గంటలకు రమ్మనేవారు. నేను మేకప్ పూర్తి చేసుకుని సిద్ధంగా ఉన్నా, రాజేష్ ఖన్నా రాత్రి 8 గంటలకు వచ్చేవారు. వచ్చి వడా పావ్ తిని, ఒక షాట్ ఇచ్చి 9 గంటలకు ప్యాకప్ చెప్పేవారు" అని జయప్రద ఆ నాటి పరిస్థితులను వివరించారు. ఆ రోజుల్లో తాను ఎదుర్కొన్న కష్టాల గురించి కూడా జయప్రద మాట్లాడారు. ఒకే రోజులో 5 షిఫ్టులు కూడా పనిచేసేదాన్నని తెలిపారు. "షరాబి" సినిమా షూటింగ్ సమయంలో ఊటీ నుంచి సాయంత్రం రైలెక్కి చెన్నై చేరుకునేదాన్నని, అక్కడి ఎయిర్‌పోర్ట్‌లోనే స్నానం చేసి ఫ్లైట్ ఎక్కేదాన్నని గుర్తుచేసుకున్నారు. విమానంలో ప్రయాణిస్తూనే మేకప్ పూర్తి చేసుకుని కోయంబత్తూరులో షూటింగ్‌కు హాజరయ్యేదాన్నని చెప్పారు. ఇలాంటి పరిస్థితులు కష్టంగా ఉన్నప్పటికీ, గర్వంగా అనిపించేదని ఆమె అన్నారు. దక్షిణాదిలో ఎన్టీఆర్, రాజ్‌కుమార్ వంటి దిగ్గజ హీరోలతో పనిచేసేటప్పుడు తాను కేవలం 16-17 ఏళ్ల అమ్మాయినని, వారితో పనిచేయడం వల్ల ఎంతో క్రమశిక్షణ నేర్చుకున్నానని జయప్రద తెలిపారు.

# చెరిగిపోని కాలానికి..

'కోర్ట్' సినిమాతో ఒక్కసారిగా యూత్‌లో విపరీతమైన క్రేజ్ సంపాదించుకున్న టాలెంటెడ్ బ్యూటీ శ్రీదేవి. మొదటి మూవీనే సూపర్ హిట్ కావడంతో ఈ అమ్మడి జోరు ఇండస్ట్రీలో పెరిగింది. ఇక ఆ తర్వాత వచ్చిన 'బ్యాండ్ మేళం' సినిమా ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయినా, ఈ బ్యూటీ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో వరుస ఆఫర్లతో బిజీగా ఉన్న శ్రీదేవి, త్వరలో 'హైకూ' మూవీతో ప్రేక్షకులను అలరించబోతున్నారు. ఈ నేపథ్యంలో.. తాజాగా, తన కొత్త ప్రాజెక్ట్‌కి సంబంధించిన ప్రకటనను షేర్ చేస్తూ.. "మా కథల పుస్తకంలో ఒక కొత్త అధ్యాయం మొదలుకాబోతోంది. మొదటి ప్రేమలు, పాత జ్ఞాపకాలు, ఎప్పటికీ చెరిగిపోని భావనల కాలానికి మేము తిరిగి వెళ్తున్నాం. మా ప్రాజెక్ట్ ప్రారంభం కాబోతోంది" అంటూ క్యాప్షన్ జత చేశారు. త్వరలోనే ఈ మూవీ షూటింగ్ డేట్స్ అనౌన్స్ చేయనున్నట్లు తెలిపారు. అయితే ఈ సినిమాలో శ్రీదేవి, ఆకాష్ ప్రేమ్‌కుమార్ జంటగా నటిస్తుండగా.. ముత్తురామ్ మురుగన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఎమ్ఆర్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై ప్రొడక్షన్ నెం. 2గా రాబోతుండగా.. ప్రేమకథా చిత్రంగా తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది.






# డైరెక్ట్‌గా ఓటీటీలోకి మృణాల్ 'పూజా మేరీ జాన్'

మృణాల్ ఠాకూర్, హుమా ఖురేషి లీడ్ రోల్స్‌లో నటించిన క్రేజీ సస్పెన్స్ థ్రిల్లర్ డ్రామా 'పూజా మేరీ జాన్'. నవజ్యోతి గులాటీ, విషాషా అరవింద్ సంయుక్తంగా దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మాడాక్ ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కించారు. ఇందులో విక్రమ్ చౌహాన్, విజయ్ రాజ్, చైతన్య వ్యాస్, రాజేష్ జైన్ వంటి టాలెంటెడ్ నటులు కీలక పాత్రల్లో కనిపించబోతున్నారు. అయితే ఈ మూవీ షూటింగ్ పూర్తయి దాదాపు నాలుగేళ్లు కావస్తున్నా, వివిధ కారణాల వల్ల థియేటర్లలో విడుదల నోచుకోలేదు. మొత్తానికి నాలుగేళ్ల ఎదురుచూపులకు తెర పడింది. ఈ సినిమాను మేకర్స్ డైరెక్ట్ డిజిటల్ స్ట్రీమింగ్‌కు తీసుకువస్తున్నారు. ఈ మేరకు తాజాగా అఫీషియల్ అనౌన్స్‌మెంట్ చేస్తూ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫాం జీ5 వేదికగా అక్టోబర్ 2 నుంచి ఈ సినిమా స్ట్రీమింగ్ కాబోతున్నట్లు స్పష్టం చేశారు. "కొన్ని కథలు మీరు చూసే విషయాలనే అనుమానించేలా చేస్తాయి.. మరికొన్ని మీరు నమ్మే విషయాలను ప్రశ్నించేలా చేస్తాయి. కానీ ఈ కథ మాత్రం వాటి మధ్యలో ఉన్న ప్రతిదానినీ ప్రశ్నించేలా చేస్తుంది" అంటూ మేకర్స్ వదిలిన ఆసక్తికరమైన క్యాప్షన్, ట్రైలర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేస్తున్నాయి.

# భారత్ ఖాతాలో తొలి పతకం

**షూటింగ్‌లో రజతంతో భారత్ బోణీ**



**ఎంఎంఏలో చారిత్రక పతకం ఖాయం చేసిన సుచిక**

**ఉజ్బెకిస్తాన్‌ను చిత్తు చేసిన మహిళల హాకీ జట్టు**

**వుషు, టెక్‌బాల్ క్రీడల్లో నిరాశ**

**సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో మహిళల క్రికెట్ జట్టు పోరు**

ఆసియా క్రీడల తొలిరోజే భారత్ పతకాల ఖాతా తెరిచింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో భారత షూటర్లు రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఇలవేనిల్ వలరివన్, సోనమ్ మస్కర్, విదర్సా వినోద్‌లతో కూడిన బృందం చైనా తర్వాత రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఈ టోర్నీలో భారత్‌కు ఇదే తొలి పతకం.



మరోవైపు, మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ (ఎంఎంఏ)లో సుచిక సెమీఫైనల్‌కు దూసుకెళ్లి చరిత్ర సృష్టించింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించడం ద్వారా ఆమె భారత్‌కు ఈ క్రీడలో తొలి పతకాన్ని ఖాయం చేసింది. ఇక భారత మహిళల హాకీ జట్టు తమ ఆరంభ మ్యాచ్‌లో ప్రభంజనం సృష్టించింది. పూల్ మ్యాచ్‌లో ఉజ్బెకిస్తాన్‌పై ఏకంగా 19–0 గోల్స్ తేడాతో ఘన విజయం సాధించి తమ ప్రచారాన్ని ఘనంగా ప్రారంభించింది. అయితే, కొన్ని విభాగాల్లో భారత్‌కు నిరాశ ఎదురైంది. వుషులో పురుషుల చాంగ్‌క్వాన్ ఫైనల్‌లో సూరజ్ సింగ్ 11వ స్థానంతో సరిపెట్టుకోవడంతో పతకం ఆశలు గల్లంతయ్యాయి. అలాగే, టెక్‌బాల్‌లోనూ భారత్‌కు పతకాలు దక్కలేదు. మహిళల సింగిల్స్, మిక్స్‌డ్ డబుల్స్ కాంస్య పతక మ్యాచ్‌లలో భారత క్రీడాకారులు ఓటమి పాలయ్యారు. ఇప్పుడు అందరి దృష్టి మహిళల క్రికెట్ జట్టుపై ఉంది. గోల్డ్ మెడల్ మ్యాచ్‌లో స్థానం కోసం హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలోని జట్టు సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌తో తలపడనుంది.





# హెట్‌మైర్ రీఎంట్రీ

## భారత్‌తో తలపడే వెస్టిండీస్ టీ20, వన్డే జట్లు ఇవే!

భారత పర్యటన కోసం వెస్టిండీస్ తమ జట్లను ప్రకటించింది. సెప్టెంబర్ 27 నుంచి అక్టోబర్ 18 వరకు జరగనున్న మూడు వన్డేలు, ఐదు టీ20ల సిరీస్ కోసం 15 మంది సభ్యులతో కూడిన వేర్వేరు జట్ల వివరాలను శనివారం వెల్లడించింది. రెండు జట్లకు షైహోప్ సారథ్యం వహించనుండగా.. భారీ మార్పులు ఏం జరగేలేదు. గాయంతో దూరమైన జాన్ కాంప్‌బెల్ వన్డే జట్టులోకి రీఎంట్రీ ఇచ్చాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్ తర్వాత విశ్రాంతి తీసుకున్న విధ్వంసకర బ్యాటర్ షిమ్రాన్ హెట్‌మైర్ టీ20 జట్టులోకి పునరాగమనం చేశాడు. సీపీఎల్ అద్వితీయమైన ప్రదర్శనతో ఆకట్టుకున్న యువ ఓపెనర్ కమిల్ పూరన్ తొలిసారి టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఈ కుడిచేతి వాటం బ్యాటర్ 8 ఇన్నింగ్స్‌ల్లో 159.64 స్ట్రైక్ రేట్ 39 సగటుతో 273 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో వెస్టిండీస్ టీ20 జట్టులో చోటు దక్కించుకున్నాడు. 2028 టీ20 ప్రపంచకప్ ప్రణాళికల్లో అతన్ని విండీస్ బోర్డు భాగం చేసింది. భారత్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ ఆడిన క్వెంటిన్ సాంప్సన్ కూడా టీ20 జట్టులోకి పునరాగమనం చేశాడు. ఆల్‌రౌండర్ జేసన్ హోల్డర్‌కు ఈ సిరీస్ నుంచి విశ్రాంతినిచ్చారు. జట్టు దీర్ఘకాలిక లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని టీ20 జట్టును ఎంపిక చేశామని హెడ్ కోచ్ డారెన్ సామీ తెలిపారు. 'శ్రీలంకపై సిరీస్ విజయంతో వచ్చిన ఊపును కొనసాగించాలనుకుంటున్నాం. అప్‌కమింగ్ టీ20 ప్రపంచకప్ కోసం బలమైన జట్టును సిద్ధం చేయడమే మా లక్ష్యం. సొంతగడ్డపై ప్రపంచ ఛాంపియన్స్‌తో తలపడటం పెద్ద సవాల్. వ్యక్తిగతంగా, సమష్టిగా మెరుగుపడటానికి ఇదో మంచి అవకాశం.'అని సామీ చెప్పుకొచ్చాడు.

**భారత పర్యటనకు వెస్టిండీస్ టీమ్స్..**

వెస్టిండీస్ వన్డే టీమ్: షై హోప్ (కెప్టెన్), జ్యువెల్ ఆండ్రూ, జాన్ క్యాంప్‌బెల్, కీసీ కార్టీ, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, జస్టిన్ గ్రీవ్స్, అమీర్ జంగూ, అల్జారీ జోసెఫ్, షమార్ జోసెఫ్, విటెల్ లావెస్, గుడకేష్ మోతీ, కీమో పాల్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, జేడెన్ సీల్స్.

వెస్టిండీస్ టీ20 టీమ్: షై హోప్ (కెప్టెన్), జ్యువెల్ ఆండ్రూ, రోస్టన్ చేజ్, మాథ్యూ ఫోర్డ్, షిమ్రాన్ హెట్మెయర్, అకేల్ హోసేన్, షమర్ జోసెఫ్, గుడాకేష్ మోటీ, కీమో పాల్, కమిల్ పూరన్, రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్, క్వెంటిన్ స్ప్రింగ్, రొమారియో సాంప్సన్, రొమారియో సాంప్సన్.

# టీమిండియాతో మ్యాచ్ గొప్ప అనుభూతి: జపాన్ కోచ్



ప్రపంచ ఛాంపియన్ భారత్‌తో టీ20 మ్యాచ్ ఆడతామనే విషయం నెల రోజుల క్రితం వరకు తమకు కనీసం తెలియదని జపాన్ క్రికెట్ జట్టు హెడ్ కోచ్ దుగాల్ బెడింగ్‌ఫీల్డ్ ఆశ్చర్యం వ్యక్తం చేశాడు. ఇదొక ఊహించని, అద్భుతమైన అవకాశమని అభివర్ణించాడు. ఇరు దేశాల ప్రధానుల స్థాయిలో జరిగిన ఉన్నతస్థాయి చర్చల తర్వాతే ఈ మ్యాచ్ హఠాత్తుగా ఖరారైందని బెడింగ్‌ఫీల్డ్ వెల్లడించాడు. ఈ చారిత్రక మ్యాచ్ కోసం తమ జట్టు ఎంతో ఉత్సాహంగా ఎదురుచూస్తోందని తెలిపాడు. మంగళవారం టోచిగి ప్రిఫెక్చర్‌లోని సానో అంతర్జాతీయ క్రికెట్ గ్రౌండ్‌లో సుజుకి కప్ కోసం భారత్, జపాన్ జట్ల మధ్య ఈ టీ20 మ్యాచ్ జరగనుంది. ఇప్పటికే ఈ మ్యాచ్ టికెట్లన్నీ అమ్ముడయ్యాయి. మరో రెండు రోజుల్లో ప్రారంభం కానున్న ఆసియా క్రీడలకు సన్నాహకంగా ఈ మ్యాచ్ ఉపయోగపడనుంది. ఆసియా క్రీడల్లో శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్స్‌లో ఆడనుండగా, జపాన్ తన తొలి మ్యాచ్‌లో ఆఫ్ఘనిస్థాన్‌తో తలపడనుంది.

# లంకపై క్లీన్‌స్వీప్.. అగ్రస్థానానికి ఇంగ్లండ్

టీ20 క్రికెట్‌లో ఇంగ్లండ్ జట్టు మళ్లీ అగ్రస్థానాన్ని కైవసం చేసుకుంది. శ్రీలంకతో జరిగిన మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయడం ద్వారా భారత్‌ను వెనక్కి నెట్టి టీ20 ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్ 1 స్థానానికి చేరుకుంది. నిన్న మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లో జరిగిన చివరి మ్యాచ్‌లో ఇంగ్లండ్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి, 3–0 తేడాతో సిరీస్‌ను సొంతం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన శ్రీలంక, ఇంగ్లండ్ బౌలర్ల ధాటికి కేవలం 124 పరుగులకే కుప్పకూలింది. సోనీ బేకర్, జోఫ్రా ఆర్చర్, విల్ జాక్స్ తలా రెండు వికెట్లు పడగొట్టి లంక పతనాన్ని శాసించారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఇంగ్లండ్ సునాయాసంగా విజయం సాధించింది. ఈ సిరీస్‌కు ముందు సౌతాంప్టన్, కార్డిఫ్‌లలో జరిగిన మ్యాచ్‌లలో కూడా ఇంగ్లండ్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఇటీవలే శ్రేయస్ అయ్యర్ నేతృత్వంలోని భారత జట్టు ఆఫ్ఘనిస్థాన్‌పై 3–0 తేడాతో సిరీస్ గెలిచినప్పటికీ, ఇంగ్లండ్ తాజా విజయంతో పాయింట్ల పట్టికలో భారత్‌ను అధిగమించి అగ్రపీఠాన్ని దక్కించుకుంది. దీంతో భారత్ రెండో స్థానానికి పరిమితమైంది.





# షఫాలీ శతక విధ్వంసం

## బంగ్లా బేజారు.. సూపర్ విక్టరీతో ఫైనల్‌కు భారత్

**సెమీ ఫైనల్లో 114 పరుగుల భారీ విజయం.. 49 బంతుల్లోనే షఫాలీ వర్మ శతకం**

ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో భారత జట్టు ఫైనల్‌కు దూసుకెళ్లింది. యువ ఓపెనర్ షఫాలీ వర్మ ఆకాశమే హద్దుగా చెలరేగి అద్భుత శతకంతో కదం తొక్కడంతో సెమీ ఫైనల్‌లో బంగ్లాదేశ్‌పై భారత్ 114 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ విజయంతో స్వర్ణ పతక పోరుకు అర్హత సాధించి, పతకాన్ని ఖాయం చేసుకుంది. బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించిన భారత జట్టు, బంగ్లాదేశ్‌ను చిత్తుగా ఓడించింది.



ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన భారత్, ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన బంగ్లా బౌలర్లపై విరుచుకుపడ్డారు. కేవలం 28 బంతుల్లోనే 50 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఈ క్రమంలో మంధాన 16 బంతుల్లో 27 పరుగులు చేసి ఔటైనా, పవర్ ప్లే ముగిసేసరికి భారత్ వికెట్ నష్టానికి 72 పరుగులతో పటిష్ఠ స్థితిలో నిలిచింది. మరోవైపు షఫాలీ తన జోరును కొనసాగించింది. కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకం పూర్తి చేసుకుని బంగ్లా బౌలింగ్‌ను చీల్చి చెండాడింది. అనంతరం కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో జతకలిసిన షఫాలీ, మరో కీలక భాగస్వామ్యాన్ని నిర్మించింది. వీరిద్దరూ కలిసి 50 పరుగులకు పైగా జోడించి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. ఈ క్రమంలో షఫాలీ తన విధ్వంసక ఇన్నింగ్స్‌ను కొనసాగిస్తూ కేవలం 49 బంతుల్లోనే అజేయ శతకాన్ని పూర్తి చేసుకుంది. ఆమె ఇన్నింగ్స్‌లో 9 భారీ సిక్సర్లు, 3 ఫోర్లు ఉన్నాయి. 204.08 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేసిన షఫాలీ చివరి వరకు క్రీజులో నిలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 33 బంతుల్లో 40 పరుగులతో ఆమెకు అండగా నిలవడంతో, భారత జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 195 పరుగుల భారీ స్కోరు సాధించింది. 196 పరుగుల భారీ లక్ష్య ఛేదనతో బరిలోకి దిగిన బంగ్లాదేశ్, ఆరంభం నుంచే తీవ్ర ఒత్తిడికి గురైంది. భారత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. పవర్ ప్లే ముగిసే సమయానికే 39 పరుగులకు 3 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ తర్వాత కూడా బంగ్లా ఇన్నింగ్స్ ఏ దశలోనూ కోలుకోలేదు. భారత బౌలర్లు విజృంభించడంతో 9 ఓవర్ల తర్వాత 49 పరుగులకే 5 వికెట్లు కోల్పోయింది. చివరకు 15.4 ఓవర్లలో కేవలం 81 పరుగులకే ఆలౌట్ అయింది. దీంతో భారత జట్టు 114 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి ఫైనల్లో అడుగుపెట్టింది. ఈ అద్భుత ప్రదర్శనతో భారత జట్టు స్వర్ణ పతకంపై కన్నేసింది.



# హైదరాబాద్ రంజీ జట్టు కెప్టెన్‌గా సిరాజ్

టీమిండియా స్టార్ ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్‌కు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) కీలక బాధ్యతలు అప్పగించింది. 2026–27 రంజీ ట్రోఫీ సీజన్‌లో భాగంగా మొదటి రెండు మ్యాచ్‌లకు హైదరాబాద్ జట్టుకు సిరాజ్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఈ మేరకు హెచ్‌సీఏ అధికారికంగా ప్రకటించింది. ఎడమచేతి వాటం పేసర్ సీవీ మిలింద్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. సీనియర్ సెలక్షన్ కమిటీ 15 మంది సభ్యులతో కూడిన జట్టును ఎంపిక చేసింది. ఒకవేళ జాతీయ జట్టుకు ఆడాల్సి వస్తే, సిరాజ్ అందుబాటులో లేని మ్యాచ్‌లకు మిలింద్ కెప్టెన్సీ బాధ్యతలు చేపడతాడని హెచ్‌సీఏ స్పష్టం చేసింది. జట్టులో అనుభవజ్ఞులైన బ్యాటర్లు తన్మయ్ అగర్వాల్, రాహుల్ సింగ్, వికెట్ కీపర్లు రాహుల్ రదేశ్, సాయి ప్రజ్ఞయ్ రెడ్డిలకు చోటు దక్కింది. వీరితో పాటు ఎం.అభిరత్ రెడ్డి, కె.హిమతేజ, వరుణ్ గౌడ్, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డి, సీటీఎల్ రక్షణ్ రెడ్డి, అజయ్ దేవ్‌గౌడ్, రుతిక్ యాదవ్ మెండే, సాయి వికాస్ రెడ్డి జట్టులో ఉన్నారు. రంజీ సీజన్‌లో భాగంగా హైదరాబాద్ తన తొలి మ్యాచ్‌ను అక్టోబర్ 11న త్రిపురతో ఆడనుంది. అయితే, ఈ మ్యాచ్ వేదిక ఇంకా ఖరారు కాలేదు. అనంతరం అక్టోబర్ 18 నుంచి విశాఖపట్నంలో ఆంధ్ర జట్టుతో తలపడనుంది. ప్రస్తుతం సిరాజ్ వెస్టిండీస్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు.

నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# ఆకాశం నుంచి అధఃపాతాళానికి టాటా పరువు!

ఒకప్పుడు టాటా అంటే విశ్వసనీయతకు మరో పేరు. వ్యాపారం అంటే లాభమే కాదు.. విలువలు కూడా ఉండొచ్చని భారత కార్పొరేట్ రంగానికి చెప్పిన పేరు. పారదర్శకత, నైతికత, సామాజిక బాధ్యత.. ఇవన్నీ కలిస్తే టాటా అనే ముద్ర ఉండేది. కానీ ఇప్పుడు అదే టాటా పేరు వరుస వివాదాలతో వార్తల్లోకి ఎక్కుతుండటం ఆ సంస్థ ప్రతిష్ఠకే పెద్ద దెబ్బ. తాజాగా టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్ పునర్నియామకం వివాదంగా మారింది. సెప్టెంబర్ 17న జరిగిన బోర్డు సమావేశంలో చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్ల పదవీకాలాన్ని ఆమోదించారు. అయితే టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ట్రస్ట్స్ మాత్రం ఈ తీర్మానం చట్టబద్ధంగా చెల్లదని ప్రకటించాయి. ట్రస్ట్స్ నామినీ డైరెక్టర్లకు ఉన్న ప్రత్యేక హక్కులను ఉటంకిస్తూ తమ వాదనను ముందుకు తెచ్చాయి. ఇది చిన్న బోర్డు గొడవ కాదు. ఇది టాటా వ్యవస్థలోని అంతర్గత సమన్వయం ఎంత బలంగా ఉందన్న ప్రశ్న. ఇంకా విచిత్రమేమిటంటే.. ఆగస్టు 12న చంద్రశేఖరన్ ప్రస్తుత పదవీకాలం ముగిసిన తర్వాత మరోసారి కొనసాగాలని తాను అనుకోవడం లేదని బోర్డుకు తెలియజేసినట్లు టాటా ట్రస్ట్స్ చెబుతోంది. ఆ నిర్ణయం అందరికీ తెలిసిన తర్వాత మళ్లీ పునర్నియామక తీర్మానం రావడమే ఇప్పుడు వివాదానికి కేంద్రబిందువైంది. ఇలాంటి పరిణామాలు సాధారణ కంపెనీలో జరిగితే పెద్దగా ఆశ్చర్యం ఉండకపోవచ్చు. కానీ టాటా పేరు సాధారణం కాదు. దశాబ్దాలుగా భారతీయ సమాజంలో సంపదకన్నా విలువలకు, అధికారంకన్నా బాధ్యతకు ప్రతీకగా నిలిచిన సంస్థ అది. అందుకే టాటాలో జరిగే ప్రతి అంతర్గత పరిణామం మార్కెట్‌ను మాత్రమే కాదు.. ప్రజల విశ్వాసాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. ఇప్పటికే టాటా సన్స్ భవిష్యత్తు నిర్మాణంపై మరో పెద్ద ప్రశ్న నడుస్తోంది. సంస్థను స్టాక్ మార్కెట్‌లో నమోదు చేసే ప్రక్రియకు బోర్డు ముందుకు వెళ్లాలని నిర్ణయించగా, టాటా ట్రస్ట్స్ దీనిపైనా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. అంటే చైర్మన్ ఎవరు? సంస్థ భవిష్యత్తు దిశ ఏమిటి? టాటా సన్స్ పాలనా నిర్మాణం ఎలా ఉండాలి? అన్న మూడు కీలక అంశాలు ఒకేసారి ఢీకొంటున్నాయి. కంపెనీలు కష్టాలను ఎదుర్కొంటాయి. వ్యాపార నిర్ణయాలు విఫలమవుతాయి. మార్కెట్‌లో ఎగుడు దిగుడులు సహజం. కానీ ఒక సంస్థ అంతర్గతంగా నిర్ణయాలు తీసుకునే విధానంపైనే ప్రశ్నలు తలెత్తితే అది కేవలం వ్యాపార సమస్య కాదు.. పాలనా సమస్య. టాటా గతంలో కూడా నాయకత్వ వివాదాలను చూసింది. సైరస్ మిస్త్రీ ఉదంతం దేశవ్యాప్తంగా కార్పొరేట్ పాలనపై పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు మళ్లీ చైర్మన్ పదవి చుట్టూ ట్రస్ట్స్--బోర్డు మధ్య విభేదాలు బహిర్గతం కావడం, అప్పటి చేదు అధ్యాయాలను గుర్తు చేస్తోంది. తాజా వివాదంలో టాటా ట్రస్ట్స్ తమ వాదనకు గత సైరస్ మిస్త్రీ కేసులో టాటా సన్స్ స్వయంగా సమర్థించిన నామినీ డైరెక్టర్ల హక్కులను కూడా ఆధారంగా చూపుతోంది. అంటే సమస్య వ్యక్తుల మధ్య విభేదమా? లేక వ్యవస్థలోనే స్పష్టత లోపించిందా? ఎంత పెద్ద సంస్థ అయినా నియమాలకు మించి ఎవరూ ఉండకూడదు. బోర్డు నిర్ణయమా? ట్రస్టుల హక్కులా? నామినీ డైరెక్టర్ల సమ్మతా? సంస్థ నియమావళి ఏం చెబుతోంది? ఎవరి అధికారానికి ఎంత పరిమితి ఉంది? ఇవన్నీ స్పష్టంగా తేలాలి. లేదంటే ప్రతి నిర్ణయం తర్వాత కొత్త వివాదం పుడుతుంది. కార్పొరేట్ ప్రపంచంలో నమ్మకం ఒకసారి దెబ్బతింటే దాన్ని తిరిగి సంపాదించడం కష్టం. టాటా విషయంలో ఇది మరింత కీలకం. ఎందుకంటే టాటా ఉత్పత్తులను కొనేవాడు కేవలం ఒక వస్తువును కొనడం కాదు.. ఆ బ్రాండ్‌పై ఉన్న విశ్వాసాన్నీ కొనుగోలు చేస్తున్నాడు. అందుకే ఇప్పుడు టాటాకు కావాల్సింది మరో బోర్డు తీర్మానం కాదు. స్పష్టత కావాలి. సమన్వయం కావాలి. సంస్థాగత క్రమశిక్షణ కావాలి.

# రావాలి.. స్టీల్ బ్యాంక్ ఉద్యమం!

**ఒక పెళ్లి ముగిసింది.. విందు అయిపోయింది.. వచ్చిన బంధువులు, స్నేహితులు ఎవరి దారిన వారు వెళ్లిపోయారు. కానీ తెల్లారేసరికి అక్కడ మిగిలేది ఏమిటి? పళ్లాలు.. గ్లాసులు.. కవర్లు.. చెత్త! మన సంతోషం కొన్ని గంటలే. ఆ సంతోషం మిగిల్చిన ప్లాస్టిక్ మాత్రం ప్రకృతిపై దీర్ఘకాల భారంగా మారుతోంది. సౌకర్యం కోసం మొదలైన 'వాడి పారేయడం' అలవాటు ఇప్పుడు ఊరి చెత్తకుప్ప నుంచి కాలువకు, కాలువ నుంచి చెరువుకు చేరుతోంది. మరి ప్లాస్టిక్‌నే నిందిస్తూ కూర్చుంటే సమస్య తీరుతుందా? నిషేధం ఒక్కటే సరిపోతుందా? ప్రత్యామ్నాయం చేతిలో పెట్టకుండా అలవాటు ఎలా మారుతుంది? ఇక్కడే స్టీల్ పళ్లెం.. స్టీల్ గ్లాసు.. ఒక చిన్న ఆలోచనగా మొదలై పెద్ద సామాజిక బాధ్యతగా మారాలి. ఒకప్పుడు పల్లెల్లో పెళ్లి అంటే పక్కింటి నుంచి పళ్లాలు వచ్చేవి. ఒక ఇంట్లో సరిపోకపోతే ఇంకో ఇంటి నుంచి గ్లాసులు వచ్చేవి. కార్యక్రమం అయిపోయాక కడిగి మళ్లీ వాళ్ల ఇళ్లకే పంపించేవారు.**

ఎవరి వస్తువు వారిదైనా.. అవసరంలో ఊరంతా ఒకటే. ఇచ్చిపుచ్చుకోవడం, పొదుపు, మళ్లీ ఉపయోగించడం మన జీవన విధానంలోనే ఉండేవి. కాలం మారింది.. సౌకర్యం పెరిగింది.. కానీ దానితోపాటు వాడి పారేసే సంస్కృతి కూడా పెరిగింది. ఇప్పుడు పాత మంచి అలవాటును కొత్త పంచాయతీ వ్యవస్థతో కలపాల్సిన సమయం వచ్చింది. ప్రతి గ్రామంలో ఒక స్టీల్ బ్యాంకు ఎందుకు ఉండకూడదు? పెళ్లికి పళ్లాలు అక్కడే.. అన్నదానానికి గ్లాసులు అక్కడే.. జాతరకు అవసరమైన పాత్రలు అక్కడే.. పాఠశాల కార్యక్రమానికీ అక్కడే. తీసుకెళ్లండి.. వాడండి.. కడగండి.. తిరిగి ఇవ్వండి. అంతే. చెత్త తగ్గుతుంది.. ఖర్చు తగ్గుతుంది.. ఊరు శుభ్రంగా ఉంటుంది. ఇది కేవలం ఊహ కాదు. తెలంగాణలో ఇప్పటికే కొన్ని చోట్ల స్టీల్ బ్యాంకులు ఆచరణలోకి వచ్చాయి. సిద్దిపేటలో గ్రామపంచాయతీ స్థాయిలో స్టీల్ బ్యాంకుల ఏర్పాటు విస్తరించింది. 499 గ్రామపంచాయతీ కార్యాలయాల్లో స్టీల్ పాత్రలు అందుబాటులోకి తెచ్చి సమావేశాలు, కార్యక్రమాల్లో వాటినే ఉపయోగించే విధానం అమలైంది. ప్లేట్లు, గ్లాసులు, టీ కప్పులు, బాటిళ్లు వంటి సామగ్రిని పునర్వినియోగం చేయడం ద్వారా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించారు. సిద్దిపేట నమూనా కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వేలోనూ ప్రస్తావనకు వచ్చింది. అంటే మంచి ఆలోచనకు ఆధారం ఉంది. దాన్ని ఒక్క జిల్లాలోనే ఆపేయాల్సిన అవసరం ఏముంది? ప్రతి పల్లెకు తీసుకెళ్లే సంకల్పం ఉంటే చాలు.

సిద్దిపేట అనుభవంలో మరో ముఖ్యమైన విషయం ఉంది. స్టీల్ పాత్రలు కొనుగోలు చేయడం దగ్గరే పని ఆగిపోలేదు. గ్రామస్థాయి స్వయం సహాయక సంఘాలకు వాటి నిర్వహణ బాధ్యతలు అప్పగించే విధానం ఏర్పడింది. పాత్రలను అద్దెకు ఇవ్వడం, తిరిగి తీసుకోవడం, శుభ్రం చేయడం, భద్రపరచడం వంటి పనులను సంఘాలు నిర్వహిస్తున్నాయి. కేంద్ర స్వచ్ఛ భారత్ మిషన్ ప్రచురించిన నమూనా వివరాల్లో గ్రామపంచాయతీలు ప్రారంభ పెట్టుబడితో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసి, తరువాత మహిళా స్వయం సహాయక సంఘాలు వాటిని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అంటే పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళల భాగస్వామ్యానికీ ఇది ఒక వేదిక కావచ్చు. ఖమ్మంలోనూ స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్ బ్యాంకులు ఏర్పాటు చేసి, ప్లేట్లు, గ్లాసులు, చెంచాలు తదితరాలను కార్యక్రమాలకు అద్దెకు ఇచ్చే విధానం అమలు చేసిన ఉదాహరణ ఉంది. అయితే స్టీల్ బ్యాంకు అంటే నాలుగు పళ్లాలు, పది గ్లాసులు పెట్టి తాళం వేసే గది కాదు. అది ప్రజా వ్యవస్థ. ప్రతి పంచాయతీ తన జనాభా, కార్యక్రమాల సంఖ్య, అవసరాన్ని బట్టి సామగ్రి కొనాలి. 300 కుటుంబాలున్న ఊరికి ఒక సంఖ్య.. వెయ్యి కుటుంబాలున్న ఊరికి మరో సంఖ్య. పంచాయతీ నిధులతో కొనుగోలు చేయొచ్చు. దాతలు, వ్యాపారులు, యువజన సంఘాలు, పూర్వ విద్యార్థుల సంఘాలు కూడా సహకరించొచ్చు. ఇంట్లో అదనంగా ఉన్న మంచి స్టీల్ పాత్రను గ్రామానికి అందించే అవకాశం కల్పించొచ్చు. ఎన్ని పళ్లాలు ఉన్నాయి? ఎన్ని గ్లాసులు ఉన్నాయి? ఎవరు తీసుకెళ్లారు? ఎప్పుడు ఇచ్చారు? ఎప్పుడు తిరిగి వచ్చాయి? ఎన్ని దెబ్బతిన్నాయి? అన్న లెక్క రిజిస్టర్‌లో ఉండాలి. ప్రజా ఆస్తి అంటే ఎవరిదీ కాదు అని కాదు.. అందరిదీ అనే భావన రావాలి. ఇక్కడ జగిత్యాల జిల్లాలో నాగిరెడ్డి మధుసూదన్‌రెడ్డి దంపతులు చేస్తున్న ప్రయత్నాన్ని ఒక ఉదాహరణగా చూడొచ్చు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే ఉద్దేశంతో గ్రామాల్లో అవగాహన కల్పించడం, స్టీల్ పళ్లాలు, గ్లాసులు అందుబాటులోకి తేవడం, ప్లాస్టిక్ కవర్లకు బదులుగా కాటన్ సంచులను ప్రోత్సహించడం వంటి కార్యక్రమాల్లో వారు తమ వంతు సామాజిక బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. మధుసూదన్‌రెడ్డి తన గ్రామంలో జరిగే కార్యక్రమాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులకు బదులుగా స్టీల్ సామగ్రి అందుబాటులో ఉంచినట్టు వార్తా కథనాలు పేర్కొన్నాయి. ఒక వ్యక్తి తనకు ఎదురైన అనుభవాన్ని సమాజానికి ఉపయోగపడే చైతన్యంగా మార్చుకోవడం ఇక్కడ కనిపిస్తుంది. కానీ ఇలాంటి ప్రయత్నం ఒక వ్యక్తి లేదా ఒక కుటుంబం భుజాలపై మాత్రమే ఉండకూడదు. వ్యక్తిగత చొరవకు పంచాయతీ వ్యవస్థ తోడైతేనే అది నిలకడైన ఉద్యమంగా మారుతుంది. వ్యక్తిని అభినందించడం కంటే.. ఆ ఆలోచనను ఊరు ఆచరించడం గొప్ప గౌరవం.

జగిత్యాల జిల్లాలోనే గతంలో మల్లాపూర్ గ్రామపంచాయతీ వివాహాలు, ఇతర కార్యక్రమాలకు ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులు వాడకుండా స్టీల్ ప్లేట్లు, గ్లాసులు ఉచితంగా అందించిన ఉదాహరణను స్వచ్ఛ భారత్ మిషన్ నమోదు చేసింది. అలాగే ఇటుక్యాల గ్రామపంచాయతీ కుటుంబాలకు జ్యూట్ సంచులు అందించిన కార్యక్రమం కూడా నమోదైంది. అంటే మన జిల్లాకే ఈ ఆలోచన కొత్తది కాదు. ఉన్న మంచి ప్రయత్నాలను ఒక పద్ధతిలోకి తెచ్చి ప్రతి గ్రామానికి విస్తరించడమే ఇప్పుడు అవసరం. నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వాములను చేస్తే మరింత ప్రయోజనం. పాత్రలు ఇవ్వడం.. తిరిగి తీసుకోవడం.. శుభ్రం చేయడం.. నిల్వ చేయడం.. లెక్కలు చూడడం.. అన్నీ ఒక క్రమంలో నడపవచ్చు. తగిన నిర్వహణ రుసుము తీసుకోవచ్చు. ఆ ఆదాయంతో శుభ్రత, మరమ్మతులు, కొత్త పాత్రల కొనుగోలు చేయవచ్చు. అప్పుడు పంచాయతీపై ప్రతిసారీ ఆర్థిక భారం పడదు. ఒకవైపు ప్లాస్టిక్ తగ్గుతుంది.. మరోవైపు మహిళా



సంఘాలకు నిర్వహణ ద్వారా ఆదాయం వస్తుంది. పర్యావరణం కాపాడటానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి రెండు పనులు ఒకేసారి జరుగుతాయి. స్టీల్ బ్యాంకు పెళ్లిళ్లకే పరిమితం కావాల్సిన పనిలేదు. జాతరలు, అన్నదానాలు, దేవాలయ కార్యక్రమాలు, పాఠశాల వేడుకలు, గ్రామసభలు, ప్రభుత్వ కార్యక్రమాలు, మహిళా సంఘాల సమావేశాలు, యువజన కార్యక్రమాలు.. ఎక్కడ సామూహిక భోజనం ఉంటే అక్కడ స్టీల్‌కు చోటుండాలి. ఫంక్షన్ హాళ్లు, దేవాలయాలు, క్యాటరింగ్ నిర్వాహకులతో పంచాయతీలు సమన్వయం చేసుకోవచ్చు. పెద్ద కార్యక్రమం పెట్టుకునే వారికి ముందే స్టీల్ బ్యాంకు అందుబాటులో ఉందని తెలియజేయాలి. "ప్లాస్టిక్ వాడొద్దు" అని చెప్పడం ఒక మాట. "వాడొద్దు.. ఇదిగో స్టీల్ తీసుకెళ్లండి" అని ప్రత్యామ్నాయం ఇవ్వడం ఆచరణ. ప్లాస్టిక్ సమస్యను కేవలం చెత్త సమస్యగా చూడటం కూడా సరికాదు. కాలువల్లో పేరుకుపోతే నీటి ప్రవాహానికి అడ్డంకి. పశువులు తింటే ప్రమాదం. చెత్తను కాల్చితే కాలుష్యం. నేలలో పేరుకుంటే మరో సమస్య. కార్యక్రమం ముగిసిన వెంటనే చేతిలోంచి వదిలేసిన ప్లాస్టిక్ అక్కడితో మన జీవితాన్ని వదిలిపెట్టదు. మరో రూపంలో తిరిగి మన ముందుకొస్తుంది. అందుకే "వాడి పారేయ్" సంస్కృతికి బదులు "వాడు.. కడుగు.. మళ్లీ వాడు" అనే పద్ధతి రావాలి. చట్టం తన పని చేసుకుంటుంది.. ప్రజల అలవాటు తనంతట తానే మారదు. అలవాటుకు ప్రత్యామ్నాయం చూపించాలి.

ఇక్కడ కొత్తగా బాధ్యతలు చేపట్టిన యువ సర్పంచ్‌లకు ఒక మంచి అవకాశం ఉంది. రోడ్డు వేస్తే కనిపిస్తుంది.. భవనం కడితే కనిపిస్తుంది.. కానీ మంచి అలవాటు పెడితే అది తరతరాలకు కనిపిస్తుంది. "నా పదవీకాలంలో ఒక భవనం కట్టాను" అన్నదానికంటే "నా ఊరిలో వాడి పారేసే సంస్కృతికి బదులు మళ్లీ ఉపయోగించే పద్ధతి తెచ్చాను" అని చెప్పగలగడం కూడా అభివృద్ధే. ప్రతి సర్పంచ్ తన గ్రామానికి ఒక స్టీల్ బ్యాంకును లక్ష్యంగా పెట్టుకోవచ్చు. ఒక ఊరు చేస్తే పక్క ఊరు చేయాలి. ఒక మండలం చేస్తే మరో మండలం ముందుకు రావాలి. పోటీ ఉండాలి.. కానీ ఎవరు ఎక్కువ ఖర్చు చేశారనే పోటీ కాదు. ఎవరు ఎక్కువ ప్లాస్టిక్ తగ్గించారు? ఎవరి స్టీల్ బ్యాంకు ఎక్కువ కార్యక్రమాలకు ఉపయోగపడింది? ఎవరి ప్రజలు ఎక్కువగా భాగస్వాములయ్యారు? అనే మంచి పోటీ ఉండాలి. అయితే ప్రారంభోత్సవం చేసి ఫొటోలు పెట్టడంతో పని అయిపోదు. అసలు పరీక్ష ఆ తర్వాతే. పాత్రలు శుభ్రంగా లేకపోతే ప్రజలు మళ్లీ ప్లాస్టిక్ వైపు చూస్తారు. తీసుకెళ్లినవి తిరిగి రాకపోతే వ్యవస్థ దెబ్బతింటుంది. అందుకే ముందే నియమాలు ఉండాలి. అవసరమైతే డిపాజిట్ తీసుకోవాలి. నిర్వహణ రుసుము నిర్ణయించాలి. శుభ్రతకు ప్రత్యేక బాధ్యత పెట్టాలి. నిల్వకు భద్రమైన స్థలం ఉండాలి. సంవత్సరానికి ఒకసారి గ్రామసభలో స్టీల్ బ్యాంకు లెక్కలను ప్రజల ముందుంచాలి. ఎంత కొనుగోలు చేశారు? ఎంత వినియోగించారు? ఎన్ని దెబ్బతిన్నాయి? ఎంత ఆదాయం వచ్చింది? ఎంత ఖర్చయింది? అన్నీ బహిరంగంగా ఉంటే నమ్మకం పెరుగుతుంది. చివరికి ఇది ఒక పళ్లెం గురించి కాదు.. ఒక జీవన విధానం గురించి. మన పెద్దలు వాడిన మంచి పద్ధతిని మనం ఆధునిక సౌకర్యాల మధ్య మర్చిపోయాం. ఇచ్చిపుచ్చుకోవడం.. పొదుపు.. పునర్వినియోగం.. సామూహిక బాధ్యత.. ఇవన్నీ మన పల్లె సంస్కృతిలోనే ఉన్నాయి. ఇప్పుడు వాటికి పంచాయతీ వ్యవస్థను జోడించాలి. వ్యక్తిగత చొరవ సామాజిక బాధ్యతగా మారాలి. సామాజిక బాధ్యత గ్రామ విధానంగా మారాలి. గ్రామ విధానం ప్రజల అలవాటుగా మారాలి.



శ్రీశైలం దూడం
ఫ్రీలాన్స్ జర్నలిస్టు, 9133947176

# నిజాంను ఎదురించిన యోధుడు.. కొండా లక్ష్మణ్ బాపూజీ



**(నేడు తెలంగాణ ఉద్యమ ఆది గురువు వర్ధంతి)**

తెలంగాణ చరిత్రను చదివితే ఎన్నో ఉద్యమాలు కనిపిస్తాయి. ఎన్నో పోరాటాలు కనిపిస్తాయి. ఎందరో ఉద్యమకారులు కనిపిస్తారు. కానీ ఒక మనిషి జీవితాన్ని పరిశీలిస్తే మాత్రం తెలంగాణ కోసం సాగిన అనేక దశల పోరాటాలు ఒకే వ్యక్తి జీవితంతో ముడిపడి కనిపిస్తాయి. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం.. ముల్కీ హక్కుల ఉద్యమం.. సామాజిక న్యాయం కోసం పోరాటం.. చేనేత కార్మికుల సంక్షేమం.. 1969 ప్రత్యేక తెలంగాణ ఉద్యమం.. మలి దశ తెలంగాణ ఉద్యమం.. ఇలా తెలంగాణ ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ. అందుకే ఆయనను కేవలం రాజకీయ నాయకుడిగా చూడటం చరిత్రకు అన్యాయం. లిలితెలంగాణ ఉద్యమానికి ఆది గురువుగా, త్యాగానికి ప్రతీకగా, తెలంగాణ హక్కుల కోసం జీవితాన్ని అంకితం చేసిన పోరాట యోధుడిగాలిలి కొండా లక్ష్మణ్ బాపూజీని గుర్తించాలి. 1915 సెప్టెంబర్ 27న అప్పటి ఆదిలాబాద్ జిల్లా వాంకిడి ప్రాంతంలో జన్మించిన కొండా లక్ష్మణ్ చిన్ననాటి నుంచే సామాజిక అసమానతలను, ప్రజల కష్టాలను దగ్గరగా చూశారు. న్యాయశాస్త్ర విద్యను అభ్యసించి న్యాయవాదిగా పనిచేసిన ఆయన.. అన్యాయానికి గురైనవారికి అండగా నిలిచారు. నిజాం పాలనలో ప్రజలపై సాగిన అణచివేతకు వ్యతిరేకంగా న్యాయపరంగానూ, ఉద్యమపరంగానూ తన వంతు పాత్ర పోషించారు. 1942లో జరిగిన క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న కొండా లక్ష్మణ్.. అనంతరం నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలోనూ చురుకైన పాత్ర పోషించారు. తెలంగాణ ప్రాంతంలో వెట్టిచాకిరీ, సామాజిక వివక్ష, భూస్వామ్య దోపిడీ వంటి సమస్యలపై ఆయన గళమెత్తారు. నిజాం వ్యతిరేక పోరాట కాలంలో ప్రజల తరఫున కేసులు వాదించిన న్యాయవాదిగా మాత్రమే కాకుండా, అవసరమైన సందర్భాల్లో ఉద్యమకారుడిగానూ ఆయన ముందుండేవారు. తెలంగాణలో ప్రజాస్వామ్య హక్కుల కోసం సాగిన పోరాటంలో ఆయన పాత్ర ప్రత్యేకమైనది.

1952లో ముల్కీ హక్కుల కోసం జరిగిన ఉద్యమంలోనూ బాపూజీ పాల్గొన్నారు. తెలంగాణ ప్రజలకు ఉద్యోగాలు, అవకాశాలు, పాలనలో న్యాయమైన వాటా దక్కాలన్నది ఆయన నిరంతర డిమాండ్. అదే ఏడాది ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా శాసనసభకు ఎన్నికై ప్రజా ప్రతినిధిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారు. 1957లో చిన్నకొండూరు నియోజకవర్గం నుంచి గెలిచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ ఉపసభాపతిగా బాధ్యతలు చేపట్టారు. 1957 నుంచి 1960 వరకు ఆ పదవిలో కొనసాగారు. అనంతరం మంత్రిగా కూడా పనిచేశారు. మంత్రి పదవిలో ఉన్నప్పటికీ అధికారమే పరమావధి కాదని ఆయన తన జీవితంతో చాటారు. చేనేత, చిన్నతరహా పరిశ్రమలు, కార్మికులు వంటి వర్గాల సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ చూపారు. చేనేత రంగంతో ఆయనకు ఉన్న అనుబంధం జీవితాంతం కొనసాగింది. 1960ల నాటికి తెలంగాణలో అసంతృప్తి మరింత పెరిగింది. 1956లో ఆంధ్ర రాష్ట్రంతో తెలంగాణ విలీనమైన తర్వాత ఉద్యోగాలు, నీళ్లు, నిధులు, అవకాశాల విషయంలో తెలంగాణకు జరిగిన అన్యాయంపై ఆందోళనలు తీవ్రమయ్యాయి. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉద్ధృతమైంది. ఆ సమయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ అధికారంలో ఉన్న మంత్రి. కానీ మంత్రి పదవిని పట్టుకుని కూర్చోవడం కంటే తెలంగాణ ప్రజల ఆకాంక్షకు అండగా నిలవడమే తన బాధ్యతగా భావించారు. అందుకే లిలి1969 మార్చి చివర్లో మంత్రి పదవికి రాజీనామా చేసి ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి బహిరంగంగా మద్దతు ప్రకటించారు.లిలి ఆ రాజీనామా ఉద్యమ చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలిచింది. అధికారాన్ని వదిలేయడం సాధారణ విషయం కాదు. అందులోనూ మంత్రి పదవిని వదిలి ప్రజల పక్షాన నిలబడటం మరింత అరుదు. అందుకే బాపూజీ రాజీనామా కేవలం ఒక రాజకీయ నిర్ణయం కాదు.. తెలంగాణ పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. రాజకీయంగా ఉన్నత స్థానాలకు ఎదిగే అవకాశాలు వచ్చినప్పటికీ బాపూజీకి పదవులపై వ్యామోహం లేదు. ముఖ్యమంత్రి పదవికి పోటీ పడిన సందర్భాలున్నప్పటికీ, పదవి దక్కకపోవడాన్ని జీవిత లక్ష్యంగా మార్చుకోలేదు. తెలంగాణ ప్రజల సమస్యల పరిష్కారమే తన అసలు లక్ష్యంగా భావించారు. కాలక్రమంలో కాంగ్రెస్‌తోనూ ఆయన విభేదించారు. అధికార రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ తెలంగాణ కోసం తన పోరాటాన్ని మాత్రం ఆపలేదు.

హుస్సేన్ సాగర్ తీరంలో నిర్మించుకున్న జలదృశ్యం ఆయనకు ఎంతో ప్రీతిపాత్రమైన నివాసం. అయితే తెలంగాణ ఉద్యమం కోసం దానిని వేదికగా ఇచ్చిన తర్వాత ఆయన సాధారణ జీవనాన్నే ఎంచుకున్నారు. ఉద్యమానికి తన ఇల్లు ఇచ్చి, తాను అద్దె ఇంటిలో నివసించిన రోజులు ఆయన త్యాగానికి అద్దం పడతాయి. అధికారం కోసం ఆస్తులు కూడబెట్టే రాజకీయ సంస్కృతికి భిన్నంగా.. ఆశయం కోసం ఆస్తులను సైతం వదులుకోవచ్చని ఆయన నిరూపించారు. వయసు పెరిగినా ఆయన పోరాట పటిమ తగ్గలేదు. వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం నిరసనలు, దీక్షలు చేపట్టారు. ఢిల్లీలోనూ తెలంగాణ కోసం తన గళాన్ని వినిపించారు. గాంధేయ మార్గంలో శాంతియుత పోరాటాన్ని ఎంచుకుని, చివరి దశ వరకు ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను ప్రజల ముందుంచారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటాన్ని చూడకముందే ఆయన 2012 సెప్టెంబర్ 21న కన్నుమూశారు. ఆయన వయసు 96 సంవత్సరాలు పూర్తై 97వ సంవత్సరంలోకి ప్రవేశించిన దశ. ఆయన జీవితంలోని చివరి దశ కూడా జలదృశ్యంతోనే ముడిపడి ఉంది. కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఒక వ్యక్తి రాజకీయ చరిత్ర మాత్రమే కాదు. మూడు తరాల తెలంగాణ పోరాటాలకు మధ్య ఒక వారధి. సెప్టెంబర్ 21న ఆయన వర్ధంతి సందర్భంగా బాపూజీకి ఘన నివాళి అర్పించడం అంటే కేవలం ఆయనను స్మరించుకోవడం కాదు.. ఆయన చూపిన త్యాగం, నిబద్ధత, ప్రజాసేవ, తెలంగాణ పట్ల అచంచలమైన విశ్వాసాన్ని గుర్తుచేసుకోవడం.



రామకిష్టయ్య సంగనభట్ల,
సీనియర్ జర్నలిస్టు
ఫోన్ నంబర్: 9440595494

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.